ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ ల కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 19 ఆగస్టు 2026 | Wednesday 19 August 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 130 | Vol.No 28 Issue No .130 | www.visionandhra.in

## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

- క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం
- పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
- 2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
- హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్,ఆగస్ట్18 : తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు

మిగతా2లో..

## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం
# పోరాటం

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్18 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్,



పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల

మిగతా2లో..



## "సస్పెండ్ చేయకపోతే గాంధీ భవన్ ముట్టడిస్తా"

- వనపర్తిలో కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాట పతాక స్థాయికి
- ప్రజల్లో కాదు... నాయకుల వల్లే పార్టీకి వ్యతిరేకత వస్తోంది



**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 18:** అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కూడా కాలేదు. కానీ తెలంగాణ కాంగ్రెస్ లోపల మాత్రం అగ్గి రాజుకుంటోంది. వనపర్తి జిల్లాలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మరియు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మధ్య మొదలైన మాటల యుద్ధం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొదట చిన్నారెడ్డి "మేఘారెడ్డి డబ్బులిచ్చి ఎమ్మెల్యే టికెట్ కొనుక్కున్నాడు" అని బహిరంగంగా ఆరోపించారు. దీనికి కౌంటర్ గా మేఘారెడ్డి నిప్పులు

మిగతా2లో..

## దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

- ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..
- సోషల్ మీడియాలో ఉత్పన్నం




న్యూఢిల్లీ,ఆగస్ట్18 : కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది.

మిగతా2లో..

## ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి
- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్18 : ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ'

మిగతా2లో..

## ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

- త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు
- చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యులభేటీ..
- ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష

మిగతా2లో..



## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్18 : మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని

మిగతా2లో..

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్18 : 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా

మిగతా2లో..

## నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం
- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి
- తప్పును సరిదిద్దుకుంటున్నాం
- మీడియాతో మంత్రి పొంగులేని వివరణ



హైదరాబాద్,ఆగస్ట్18 : 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు.మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే పక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని

మిగతా2లో..

## ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు

- అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం
- ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక
- డ్రోన్ల ఎగుమతితో పెరగనున్న దేశ ఖ్యాతి
- డ్రోన్ కంపెనీల సిఇవోలతో రామ్మోహన్ నాయుడు భేటీ



కర్నూలు,ఆగస్ట్18 : డ్రోన్ సిటీకి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుఅన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడు డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో వివిధ డ్రోన్ సంస్థలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 లక్షల డ్రోన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 40 వేల డ్రోన్లు మాత్రమే ఉన్నాయని

మిగతా2లో..

## స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు ఆమోదం

- గ్రామీణ ప్రాంతాల్లో 34, పట్టణ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్లు
- మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని నిర్ణయం
- ఆర్థికసంఘం నిధులు నష్టపోకుండా సకాలంలో ఎన్నికల నిర్వహణ
- దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినేట్‌లో చర్చ



అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అలానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.1 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లను పెంచే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసిన నేపథ్యంలో కేబినెట్ నిర్ణయంకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్‌లోగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు నష్టపోకుండా ఉండేందుకు ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన అవసరాన్ని కేబినెట్ పరిగణనలోకి తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చిందితిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై

మిగతా2లో..

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం

- బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం
- ఎన్నికల హామీ మాత్రమే కాదు.... తమ రాజకీయ సిద్ధాంతం
- ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పకొనే రోజు ఇది
- టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు
- అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి,ఆగస్ట్18 : బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక

మిగతా2లో..

## నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు

వివరించారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ చూసి.. డ్రోన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఓర్వకల్లులో 600 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, శిక్షణ అన్ని ఉంటాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. డ్రోన్ శక్తిని వాటి పనితీరును ప్రధాని మోదీ గుర్తించారని చెప్పారు. మన టెక్నాలజీని ఉపయోగించి మనమే డ్రోన్ తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రధాని మోదీ సంకల్పించారని గుర్తు చేశారు. విదేశాల నుంచి డ్రోన్ల దిగుమతిని కేంద్రం నిషేధించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివిధ డ్రోన్ కంపెనీలతో సమీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకొంటామని తెలిపారు. 150 కంపెనీలకు చెందిన డ్రోన్ సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహిచడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే అసెంబ్లీలో డీఎస్సీ-2025పై చర్చకు రావాలని మంత్రి నారా లోకేశ్ ఆహ్వానిస్తే.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పించుకుని తిరుగుతున్నారని రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ సవాల్ స్వీకరించి.. అసెంబ్లీలో చర్చకు రావాలని వైఎస్ జగన్‌కు ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లులో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు లోకేశ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీకి వస్తే తన కుట్ర బయట పడుతోందనే భయంతో వైఎస్ జగన్.. చర్చకు రావడం లేదన్నారు. కూటమిపై దుష్ప్రచారం చేసి.. తన ఉనికిని కాపాడుకోవాలని వైఎస్ జగన్ చూస్తున్నారని విమర్శించారు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీచర్లను చూస్తే వైఎస్ జగన్‌కి కోపం, కక్ష అని చెప్పారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేకుండా.. పూర్తి పారదర్శకంగా వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేశామని కేంద్ర మంత్రి వివరించారు. ఏ ప్రభుత్వం చేయని టీచర్ ఉద్యోగాలు.. తాము భర్తీ చేశామని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలోనే ఏపీలో ఊహించని అభివృద్ధి జరిగిందని రామ్మోహన నాయుడు తెలిపారు.

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమిషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ÷ూఉ÷ు రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ÷ుఉ-తిఖం÷ూ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## "సస్పెండ్ చేయకపోతే గాంధీ భవన్ ముట్టడిస్తా"

చెరిగారు. "8 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన నువ్వు ఎన్ని కోట్లు చెల్లించావు? ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవిలో కూర్చుని పార్టీని, అధిష్ఠానాన్ని బద్నాం చేస్తున్నావు. నీకు కావాల్సింది పదవి రెన్యువల్, అందుకే బ్లాక్‌మెయిల్ చేస్తున్నావు"అంటూ మేఘారెడ్డి ఫైర్ అయ్యారు. విషయం ఇక్కడితో ఆగలేదు. చిన్నారెడ్డి తీరుపై వెంటనే క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి మరియు ఏఐసీసీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. ఆపై సంచలన నిర్ణయం ప్రకటించారు."వచ్చే 7 రోజుల్లో చిన్నారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే వేలాది మంది కార్యకర్తలతో హైదరాబాద్ గాంధీ భవన్ ను ముట్టడిస్తాం. అప్పుడు జరిగే దానికి పార్టీ అధిష్ఠానమే బాధ్యత వహించాలి" అని అల్టిమేటం జారీ చేశారు. ఈ వ్యాఖ్యలతో వనపర్తి కాంగ్రెస్ ఒక్కసారిగా రెండుగా చీలిపోయింది. ఒకవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి వర్గం సోషల్ మీడియా నుంచి క్షేత్ర స్థాయి వరకు బలప్రదర్శనకు దిగాయి. ఫలితంగా పార్టీ పరువు గంగలో కలుస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు. "ఎన్నికల్లో మేము కష్టపడి గెలిపిస్తే ఇప్పుడు నాయకులే కొట్టుకుంటున్నారు. ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడు లేడు. పదవుల కోసం పార్టీని తాకట్టు పెడుతున్నారు" అని స్థానిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వనపర్తికి మాత్రమే పరిమితం కాలేదు. ఆదిలాబాద్ లో మంత్రి ముందే బూతులు, పాలకుర్తిలో ఒకే కార్యక్రమానికి రెండు ఫ్లెక్సీలు, నల్గొండలో కోమటిరెడ్డి పీఏసీ మీటింగ్ కు దుమ్మా... ఇలా రాష్ట్రమంతా కాంగ్రెస్ లో ఒక్కటే వర్గపోరు. ఇంత రచ్చ జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మౌనంగా ఉండటంపై పార్టీలోనే అనుమానాలు మొదలయ్యాయి. "అసలు సీఎం స్కెచ్ ఏంటి? వీళ్లందరినీ తీసేస్తారా? లేక ఇలాగే వదిలేస్తారా?" అని నేతల నుంచి కార్యకర్తల వరకు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందో లేదో తెలియదు కానీ, ఈ నాయకుల వ్యవహారశైలితో మాత్రం 100% వ్యతిరేకత పెరుగుతోంది అని కాంగ్రెస్ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. "ఇలాగే ఉంటే 2028 లో మళ్లీ అధికారంలోకి రావడం కష్టం"అనే మాట ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినిపిస్తోంది. సీనియర్ నేతలు మాత్రం "ఇప్పటికైనా సోనియా, రాహుల్, రేవంత్ జోక్యం చేసుకోకపోతే పార్టీ పూర్తిగా దిగజారిపోతుంది" అని హెచ్చరిస్తున్నారు.

**సారాంశం:**

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కంటే పార్టీ అంతర్గత కుమ్ములాటలే ఎక్కువగా వార్తల్లోకి రావడంతో కాంగ్రెస్ పరువు పోతోంది. వనపర్తి ఘటన రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

హైదరాబాద్,ఆగస్ట్18 : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారి నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండ రామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ఒక ముసాయిదా నోట్' పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు): ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం. రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు. మూడవ కేటగిరీ (జైలు జీవితం గడిపిన వారు): తొలి దశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు. నాల్గవ కేటగిరీ (కేసులు నమోదైన వారు):

## దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కారాం చూపాలని ప్రధాని మోదీ అనడం చూస్తుంటే.. పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యల ను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశ లు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రం గం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధ౼నాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోదీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువ తను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యా ర్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు.

## ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ÷ుగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు.

## స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు ఆమోదం

కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తూ.. ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ఎ÷-లాంట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ ఆధ్వర్యంలో సోలార్ సెల్, మాడ్యూల్ ఎ÷-లాంట్, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడ ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన రంగంలో హైబ్రిడ్, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అమరావతి రైల్వే లైన్ కోసం భూసేకరణ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన అంశంపైనా నిర్ణయం తీసుకుంది. హ్యామ్ మోడల్‌లో రూ.7,469.46 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ఆమోదం తెలిపింది. బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ పరీక్షల శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం

సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు. తెదేపా రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్‌గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామన్నారు. తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ.95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. అందుకే బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పుకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

## సంపాదకీయం

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక లష్కరే అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పునః-రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టీసీఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్కడ ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళ తున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

## సర్వాయి పాపన్న గౌడ్ 376 ఘనంగా జయంతి వేడుకలు

**- బహుజన రాజ్యస్థాపన కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయం ఎమ్మెల్యే జి ఎస్ ఆర్**





భూపాలపల్లి జిల్లా 18 ఆగస్ట్ (విజన్ ఆంధ్ర) : బహుజన రాజ్య స్థాపన, సామాజిక న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ :- ఆయన పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. 17వ శతాబ్దంలోనే సామాజిక అసమానతలు, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యంగా పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు నాయకులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.వివేక్



హైదరాబాద్, ఆగస్ట్ 18 (విజన్ ఆంధ్ర) : ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఎస్.వివేక్‌ను తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైనట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.వివేక్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘటితంగా పోరాడటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఉద్యోగులను సంఘటితం చేసి వారి కనీస హక్కుల సాధనతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త ఎం.డి.ఫయాజ్ అలీలకు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

**- పెండింగ్ ల్లోఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలి**



లింగాపూర్ ఆగస్టు 18(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ధర్నా చేపట్టి సమస్యలు కూడిన వినతి పత్రాన్ని. ఎంపీడీవోకు అందజేశారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జాదవ్ రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి. పంచాయితీ సిబ్బంది అందరిని రెండవ పిఅర్సిలో గుర్తించాలి. కనీస వెతనం 26వెలు నిర్ణయించాలి. జీవో నెంబర్ 51 సవరణ మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి. కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల అకౌంట్లో వెత్తనాలు జమ చేయాలి. వయసు పైబడిన అనారోగ్యం పాలైన మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలి. ఆన్లైన్లో నమోదు కానీ కార్మికుల పేర్లను నమోదు చేయాలి. అక్రమంగా సిబ్బందిని తొలగిస్తూ సర్పంచుల పైన ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు చేపట్టాలి. మరణించిన కార్మికుడి దహన సంస్కారాలకు కనీస 30వెలు ఆర్థిక సాయం అందించాలి. పంచాయతీ కార్మికులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని ఎమ్మెల్యే వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలి.



భూపాలపల్లి జిల్లా 18 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : దళిత రిపోర్టర్ పుల్ల రవితేజ పై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ కొత్తూరి రవీందర్,, సామాజిక ఉద్యమకారుడు ఎలుకటి రాజయ్య మాదిగ లు డిమాండ్ చేసారు... ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నటివంటి భాధితుడు పుల్ల రవితేజని కలిసి పరామర్శించడం జరిగింది.. దళిత విలేకరి ని అతని ఇంటికి వెళ్లి తీవ్రంగా కొట్టడం వల్ల స్పృహ తప్పిపోయి కింద పడగ చనిపోయినాడు అని అనుకుని అక్కడే నిశ్చేష్ఠురాలై ఉన్న రవితేజ భార్య పై కనీసం మహిళ అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టి నోరు మూసి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు.. ఇంత నాగరికత అభివృద్ధి చెందుతున్న ఈ ప్రస్తుత రోజుల్లో కులం అహంకారం చూసుకుని ఒక మాదిగ పత్రిక విలేకరిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ భూపాలపెల్లి ఎమ్మెల్యే తన అనుచరలైన ముక్కిరాల మధువంశీ మరియు నటరాజ్ బొజ్జం వేణు మరియు మరో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్ర మైన దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి SC ST అట్రసిటీ కేసు మరియు హత్యాయత్నం కేసు నమోదు చేయాలి రిమాండ్ చేయాలనీ డిమాండ్ చేసారు. లేనియెడల కలిసి వచ్చిన అన్ని సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన లు నిర్వహిస్తామని హెచ్చరించారు. భూపాలపల్లి MLA గండ్ర సత్యనారాయణ రావుకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. కులం కోణంలో ఆలోచించి MLA ఏమైనా కేసు ని నీరు గార్చే ప్రయత్నం చేస్తే మాదిగల దెబ్బ ఏంటో రుచి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రేణుకుంట్ల మహేష్, పుల్ల సతీష్ మాదిగ, శీలపాక హరీష్, బండారి దశరథం, మంద ప్రవీణ్ మల్యాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**-యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో వీలీనం చేయాలని ఆలోచనను ఉపసంహరించుకోవాలి**

**-పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి**

**-శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్ డిమాండ్**




రంగారెడ్డి జిల్లా బ్యూరో/అబ్దుల్లాపూర్ మెట్ ఆగస్టు(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం సంజీవగాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి వామపక్ష విద్యార్థి సంఘల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సంజీవ గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ .. పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని వారు పేర్కొన్నారు. దీనిని శక్తిశాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలిగాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందనీ వారు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97ను ఉప సవరించుకోవాలన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని, గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపిందన్నారు. కానీ ఆతర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. ఐటీ పరిశ్రమలుశాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యాశాఖ పరిధిలోకి తెస్తామని, ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు పడలేదన్నారు. తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్వహించిందని, దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతుందని, ఇలాంటి నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందన్నారు. వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని, లేని ఎడల వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ మండల సహాయ కార్యదర్శి సత్యం, మండల కార్యవర్గ సభ్యులు అరవింద్, చందు, చరణ్ శశి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**- పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌లు సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తప్పవు

**-ప్రజాస్థలాల్లో నిర్మాణాలను ఉపేక్షించం, కఠిన చర్యలు**

**-న్యాయస్థానాల ఆదేశాలతో అక్రమ నిర్మాణాల తొలగింపు**

**-హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ స్పష్టీకరణ**

**-సాహెబ్‌నగర్‌లో వివాదాస్పద స్థలాల క్షేత్రస్థాయి పరిశీలన**




ఎల్బీనగర్, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందినటువంటి హైదరాబాద్ మహానగరం యొక్క కీర్తిని మరింత పెంపొందించాలంటే హైడ్రా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని, న్యాయస్థానాల ఆదేశాలతో ప్రభుత్వ భూములు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలను చట్టపరంగా అడ్డుకుంటామని హైడ్రా కమిషనర్ ఏ వి రంగనాథ్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్ రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ కమాన్ సమీపంలోని వెల్ఫేర్ ఆఫీసర్స్ కాలనీలో సర్వే నెంబర్ 68లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 39,40 లోని 400గజాల భూమిపై గత కొంతకాలంగా వివాదం నెలకొన్నది. కాగా ఆ స్థలంలో నూతనంగా భవనాలను నిర్మాణం అవుతున్న క్రమంలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఆయా స్థలాల విషయంలో ప్రముఖ ప్రొఫెసర్ బాలాజీతోపాటు పలువురు స్థానికులు ఈ అంశంపై రెండేళ్లుగా పోరాడుతున్నారు. వీరి ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన సిబ్బందితో కలిసి సోమవారం సాహెబ్‌నగర్ కమాన్ సమీపంలోని వెల్ఫేర్ ఆఫీసర్స్ కాలనీలో పర్యటించి, అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. సాహెబ్‌నగర్ కమాన్ సమీపంలోని వెల్ఫేర్ ఆఫీసర్స్ కాలనీలో 39, 40 ప్లాట్లను 1987లో అప్పటి కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ప్రజా అవసరాల కోసం గిఫ్ట్ డీడ్ ద్వారా కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు సొసైటీ ఆ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేదు. దీంతో కొందరు ఈ స్థలాన్ని మెము కొనుగోలు చేశామని, నూతనంగా భవనాలను నిర్మిస్తున్నారు. దీనిపై రెండేండ్ల క్రితం స్థానికులు న్యాయపరమైన పోరాటం చేస్తున్నారు. వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని తొలగించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడంతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ నిర్మాణాన్ని తొలగించే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్మాణాలను పరిశీలించారు. ఇరువర్గాలతో మాట్లాడి, వివరాలు సేకరించారు. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటాంమని, స్థల వివాదంపై న్యాయస్థానానికి జరిగిన పరిణామాలను వివరించి, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నిర్మాణాన్ని తొలగించడం పెద్ద విషయం కాదని, అయితే న్యాయస్థానాన్ని గౌరవిస్తూ, అన్ని చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ వ్యవహరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ముందుగా మాకు న్యాయం చేయండి

**-ఆరోపణలు ఎదుర్కొంటున్న జానయ్య గౌడ్ డిమాండ్**

**-మోసం చేశామంటే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**



హైడ్రా కమిషనర్ హెచ్చరికలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న జానయ్య గౌడ్ స్పందించారు. సాహెబ్ నగర్ కలాన్ పరిధిలోని ఆఫీసర్ కాలనీలో సర్వే నెంబర్ 68, ఫ్లాట్ నెంబర్ 39, 40లోని 400గజాల భూమిను రెండేండ్ల క్రితం పన్నేండ్ల క్రితం చేసిన గిఫ్ట్ డీడ్ చేసిన స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్లు స్థలం కొనుగోలు, భవన నిర్మాణానికి ఖర్చు చేశామని తెలిపారు. ఆఫీసర్స్ కాలనీవాసులు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తూ ఉన్నారని ఆరోపించారు. విచారణ జరిపి తప్పు తేలితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవస్థ మొత్తం అధికారుల వద్దే ఉందని, సమగ్ర విచారణ జరిపి నివేదిక తెప్పించాలని విజ్ఞప్తి చేశారు. తాను తప్పు చేసినట్లు విచారణలో తేలితే తనపై చర్యలు తీసుకోవాలని ఆరోపణలు ఎదుర్కొంటున్న జానయ్య గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, ఆఫీసర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్‘ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం....


**-జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-18(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 202627 ఆర్థిక సంవత్సరానికి ‘ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్’ పథకాన్ని ప్రారంభించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె. రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా బీసీ నిరుద్యోగ మహిళలకు రూ.12 వేల యూనిట్ ధర కలిగిన ఆటోమేటిక్ కుట్టు మిషన్‌ను 100 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు గల బీసీ మహిళలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. రేషన్ కార్డు కలిగి ఉండటంతో పాటు వార్షిక కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేస్తామని, దరఖాస్తుదారులకు ప్రాథమిక అక్షరాస్యత ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులు అధికంగా వస్తే కనీసం 5వ తరగతి ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మేరా / మేరు కమ్యూనిటీకి చెందిన మహిళలు, వితంతువులు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, అనాథలు, కుట్టుపనిలో నైపుణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల మహిళలు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో https://tgobmms.cgg.gov.in/ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ లేదా జోనల్ కమిషనర్ కార్యాలయంలో పరిశీలన కోసం సమర్పించాలని జె.రంగారెడ్డి కోరారు.

# ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట,ఆగస్టు18: (విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏం. జి .రోడ్ లో గండూరి బ్రదర్స్ ఎదురు, విజయ డయాగ్నొస్టిక్ ల్యాబ్ ఎదురు సందులో మణి దంత వైద్య శాల స్థాపించి 16 సంవత్సరములు గడిచిన సందర్భముగా ఈ నెల 19,20 తేదీలలో ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మణి దంత వైద్య శాల డాక్టర్.తోట కిరణ్ తెలిపారు.ప్రతి మనిషికి శరీరములలోని అవయవాల్లో దంతాలు కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగినవి తెలిపారు.మనం తీసుకున్న ఆహారాన్ని దంతాలు నమిలి శరీరానికి తోడ్పాటు నందిస్తాయి అని తెలిపారు. కావున దంతాలను అశ్రద్ధ చేయకుండా ప్రతి ఒక్కరు కాపాడుకోవలసిన బాధ్యత ఉన్నందున ఈ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలనీ తెలిపారు.




# గొట్టుముక్కల గ్రామాన్ని ప్లాస్టిక్ రైహిత గ్రామంగా ఏర్పాటుకు కృషి చేయాలి

**- డి ఎల్ పి ఓ శ్రీనివాసరావు**



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 18 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టుముక్కల గ్రామమును ప్లాస్టిక్ రైహిత గ్రామ ఏర్పాటుకు కృషి చేయాలని కామారెడ్డి డి ఎల్ పి ఓ శ్రీనివాసరావు మంగళవారం అన్నారు. గొట్టుముక్కల గ్రామపంచాయతీలో సర్పంచ్ నత్తి సంజీవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ సర్పంచ్ నత్తి సంజీవ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను రోడ్డుపై చేయకూడదు అన్నారు. ప్లాస్టిక్ ను తీసుకువచ్చి స్టీల్ టిఫిన్ బాక్సులు తీసుకువెళ్లాలని గ్రామ ప్రజలకు సూచించారు. మండల లోనే మొదటి గ్రామపంచాయతీగా ప్లాస్టిక్ రైహిత గొట్టిముక్కుల ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ముధాం శంకర్ పటేల్, వార్డు సభ్యులు కొలుపుల రాజు, రాజిరెడ్డి, పోచ గౌడ్, మడతల శంకర్, రామచంద్రం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం....

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18,(విజన్ ఆంధ్ర ) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మా కంపెనీ, సి.ఎస్..ఆర్. నిధులతో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి 25 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణంతో ఇందాని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ప్రతినిధి లోకేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిర్మల, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పాపారాయుడు గొప్ప సమరయోధుడు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 18 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : సర్దార్ సర్వాయు పాపన్న గౌడ్ గొప్ప పోరాటయోధుడని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.మంగళవారం జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్ పల్లి వెళ్ళే మార్గం వద్దగల చౌరస్తా లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... సబ్బండ వర్గాలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం ఈయన చేసిన కృషి చరిత్రలో నిలిచింది. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ఒక ప్రతీక. నాటి కాలంలో అన్ని వర్గాలనురాజ్యాధికారంలో భాగస్వాములను కావాలని ప్రజాస్వామ్యక స్ఫూర్తితో చేసిన పోరాటం గొప్ప విషయం. విశ్వ కీర్తి పొందిన ఆయన గొప్పదనాన్ని స్మరించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారీ సయ్యద్ రఫీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, గౌడ సంఘ నాయకులు, మరియు తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 20న జాబ్ మేళా

**-జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి.ప్రశాంతి**

గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీఓసీ.లోని జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, విద్యార్హతలు ఎస్ఎస్ సి/ ఐటిఐ / ఇంటర్మీడియట్ /ఏదైనా డిగ్రీ / బిటెక్ (మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ ) / బి కామ్ / ఏదైనా డిగ్రీ ఎక్స్పిరెన్స్ ఇన్ హోటల్, ఫుడ్ ఆర్ హాస్పిటల్ బ్యాక్ గ్రౌండ్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయినా నిరుద్యోగులకు శిక్షణ అనంతరం గద్వాల, ఐజ, మహబూబ్ నగర్, హైదరాబాద్ లోని వివిధ కంపెనీలు న్యూ చెక్ సొల్యూషన్, అపోలో ఫార్మసీ, హరే కృష్ణ చారిటీస్, పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, పిఎంకేకే.గద్వాల, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఆర్.సెటి గద్వాల కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి. ప్రశాంతి తెలియజేశారు.

# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు - మంత్రి జూపల్లి కృష్ణారావు



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18,(విజన్ ఆంధ్ర) : అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర అబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్లు ఆకాష్, సహిన్ సుల్తానా, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్ నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించడం జరిగిందని, అర్హులైన నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇద్దామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ కొరకు అధిక ప్రాథమిక ఇస్తుందని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పర్యాటకరంగ అభివృద్ధికి నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వట్టివాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతను పాటించడం జరుగుతుందని, ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరు అయితే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, గృహ నిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ లో

# “పుష్ప“ సీన్ రిపీట్!!

**- కాళ్లకు.. కడుపుకు డ్రగ్స్ హష్ష్ ప్యాకెట్లు గుట్టుచప్పుడు కాకుండా రవాణా!**

**- రూ.1.5 కోట్ల హషీష్ ఆయిల్ పట్టివేత**

**- అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు.. ఆరుగురు అరెస్ట్, రిమాండ్**

**- బెంగళూరుకు తరలిస్తే రూ.10 లక్షల డీల్.. ఇద్దరు కీలక నిందితులు పరారీ**

**- వనస్థలిపురం పోలీస్, ఎల్బీనగర్ ఎస్ఓటి టీం జాయింట్ ఆపరేషన్ సక్సెస్: మల్కాజిగిరి సీపీ బి.సుమతి**



ఎల్బీనగర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ లో “పుష్ప“ సీన్ రిపీట్?!! రిపీట్ అయ్యిందా?!. సంఘటన జరిగిన తీరు,వనస్థలిపురం పోలీస్, ఎల్బీనగర్ ఎస్ఓటి టీం జాయింట్ ఆపరేషన్ సక్సెస్ ఫుల్ విధుల నేపథ్యంలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఆటకట్టు. అంతర్జాతీయ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచినటువంటి పుష్ప సినిమాలోని సంఘటనలను చూసి స్ఫూర్తి పొందారో?!, లేక వైవిధ్యమైన ఆలోచనతో కొందరు అక్రమార్కులు హషీష్ ఆయిల్‌ను శరీరానికి కట్టుకుని బస్సులో తరలిస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠా సరికొత్త పందాను ఎంచుకుంది. పోలీసుల కళ్లుగప్పి హషీష్ ఆయిల్‌ను శరీరానికి కట్టుకుని బస్సులో తరలిస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠాను ఎస్ఓటీ ఎల్బీనగర్, వనస్థలిపురం పోలీసుల జాయింట్ ఆపరేషన్ తో ముఠా పట్టుబడింది. ఎల్బీనగర్ డిసిపి జోన్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌కుంట వద్ద నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితుల నుంచి 12 కిలోల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ.1.5 కోట్లు ఉంటుందని మల్కాజిగిరి సీపీ బి.సుమతి తెలిపారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ లోని మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ సిపి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపి బి.సుమతి వివరాలు వెల్లడిస్తూ... మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డేగకళ్ళ నిఘాతో పోలీస్ వ్యవస్థ నిరంతరం భద్రతలో నిమగ్నమై ఉందన్నారు. ఎలాంటి చిన్న అలికిడి జరిగిన క్షణాల వ్యవధిలోనే పోలీసులకు పక్క సమాచారం వచ్చే విధంగా భద్రతను పటిష్టం చేశామని, ఆ కోవలోని అంతర్జాతీయ డ్రగ్స్ హషీష్ ఆయిల్‌ను ముఠాను పట్టుకోవడం జరిగిందని సిపి వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాలను స్థావరంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి హషీష్ ఆయిల్‌ను సేకరించి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతోనే ప్రత్యేకంగా నిఘ ఉంచి ముఠాను పట్టుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి అనుమానం రాకుండా బస్సులో ప్రయాణిస్తూ డ్రగ్స్‌ను తరలించే ప్రయత్నం చేశారని, పోలీసులు తనిఖీలు చేయడంతో వారి అక్రమ రవాణా బయటపడిందని సిపి వెల్లడించారు.

**కాళ్లకు.. కడుపుకు కిలో చొప్పున!.........**

పోలీసుల కళ్లుగప్పేందుకు క్యారియర్లు వినూత్న పద్ధతిని అనుసరించారు. ఒక్కొక్కరు రెండు కాళ్లకు కిలో చొప్పున, కడుపుకు మరో కిలో, మొత్తం 3 కిలోల హషీష్ ఆయిల్‌ను బ్రౌన్ టేపుతో శరీరానికి కట్టుకుని తరలించారన్నారు. నలుగురు క్యారియర్లు కలిపి 12 కిలోల హషీష్ ఆయిల్ తరలిస్తూ పట్టుబడ్డారని, వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**-రూ.10 లక్షలకు డీల్?!**

ఈ 12 కిలోల హషీష్ ఆయిల్‌ను బెంగళూరుకు చేర్చేందుకు అక్కడి రిసీవర్ సిజో రూ.10 లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. సరుకు బెంగళూరుకు చేరిన అనంతరం ప్రధాన నిందితులకు ఆ మొత్తాన్ని చెల్లించేలా ఒప్పందం జరిగినట్లు వెల్లడించారు.

**-నిరుద్యోగ గిరిజన యువతే క్యారియర్లు.....**

ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు గెమ్మెలి శ్రీను, అతని భార్య నిబియా బెంగళూరులో ఉంటున్నట్లు సీపీ తెలిపారు. వీరిద్దరూ గిరిజన ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు డబ్బు ఆశ చూపి క్యారియర్లుగా ఉపయోగించుకుంటున్నారని వెల్లడించారు. నలుగురు క్యారియర్లలో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలిపారు. గతంలోనూ ఇదే తరహాలో హషీష్ ఆయిల్‌ను పలుమార్లు తరలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

**-జైలు నుంచి వచ్చి.. మళ్లీ దందా......**

ప్రధాన నిందితుడు గెమ్మెలి శ్రీనుపై గతంలోనే నర్సీపట్నం, అడవి అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ హషీష్ ఆయిల్ అక్రమ రవాణా ప్రారంభించినట్లు వెల్లడించారు.

**-సరఫరాదారు.. రిసీవర్ కోసం గాలింపు....**

హషీష్ ఆయిల్ సరఫరా చేసిన కృష్ణ, బెంగళూరులోని ప్రధాన రిసీవర్ సిజో ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని సీపీ తెలిపారు. ముఠాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

**-మత్తుపదార్థాల నిర్మూలనే లక్ష్యం: సిపి**

హషీష్ ఆయిల్‌లో టీఎచ్‌సీ శాతం సుమారు 40శాతం ఉండటంతో దీనికి ధర ఎక్కువగా ఉంటుందని సీపీ సుమతి తెలిపారు. మత్తుపదార్థాల నిర్మూలనే తమ ప్రధాన లక్ష్యమని, డ్రగ్స్ విషయంలో అసలు రాజీపడబోమని స్పష్టం చేశారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపడంతో పాటు సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ డిసిపి బి అనురాధ, ఎస్ఓటి డిసిపి కె మనోహర్, ఎస్ఓటి అడిషనల్ డిసిపి ఎండి షకీర్ హుస్సేన్, వనస్థలిపురం ఏసిపి పి కాశిరెడ్డి, వనస్థలిపురం సీఐ ఎస్ రవిబాబు, ఎస్ఓటి సిఐ కే ప్రతాప్ రెడ్డి, వనస్థలిపురం పోలీస్ సిబ్బంది, ఎస్ఓటి సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు..



సూర్యాపేట ఆగస్టు 18:(విజన్ ఆంధ్ర) : డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల నిరోధించడం లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది రాజీవ్ నగర్, మెయిన్ రోడ్, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న టీ దుకాణాలు, పాన్ షాప్స్, విద్యాసంస్థలు, నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడం లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.గంజాయి డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేశామన్నారు. మాదకద్రవ్యాలు గుర్తించే డాగ్ నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీల్లో పాల్గొని పాన్ డబ్బాలు, టి దుకాణాలు, అనుమానిత వస్తువులు, తనిఖీ నిర్వహించారు.

## మద్యం మత్తులో డయల్-100కు వరుస ఫోన్లు

**- పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు**



బోడుప్పల్, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): మద్యం సేవించి డయల్-100కు పలుమార్లు ఫోన్ చేసి పోలీసులను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెంగిచెర్ల క్రాంతికాలనీకి చెందిన డ్రైవర్ ఏళ్లపట్టి వరప్రసాద్‌రెడ్డి (47) ఈ నెల 15న రాత్రి చిన్న క్రాంతికాలనీ ప్రాంతంలో మద్యం మత్తులో పోలీసులకు పలుమార్లు ఫోన్ చేసి న్యూసెన్స్ కలిగించినట్లు పోలీసులు తెలిపారు.డయల్-100కు అనవసరంగా ఫోన్ చేయడమే కాకుండా విధుల్లో ఉన్న పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు.దీంతో పోలీసుల విలువైన సమయం వృథా చేసినందుకు అతడిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు.అనంతరం నిందితుడిని ఎల్బీనగర్‌లోని 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టులో హాజరుపరిచినట్లు మేడిపల్లి పోలీసులు వెల్లడించారు.

## పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

**- పోక్సో కేసులో రాకేష్ దోషిగా నిర్ధారణ.. రూ.3వేల జరిమానా**



ఎల్బీనగర్, ఆగస్టు(విజన్ ఆంధ్ర): మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడు ఉప్పు రాకేష్ (24)కు ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. నిందితుడిపై రూ.3 వేల జరిమానా కూడా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 405/2025లో బీఎన్ఎస్ సెక్షన్ 78, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్ విత్ 12 కింద కేసు నమోదైంది. నాగోల్ ఎస్ఐ పి.శివనాగ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీలు శోభారాణి, పి. సత్యనారాయణ వాదనలు వినిపించారు. మైనర్ బాలికల భద్రతకు ముప్పుగా మారే చర్యలపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

# చేపల చెరువు కోసం అక్రమంగా వాల్టా చట్టాన్ని అధికమించి కాల్వ తవ్వకం

**- కసాన్పల్లి పెద్ద చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు**

**- పైఅధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం: డీఈ రవిమోహన్**









అందోల్, ఆగస్టు 18 సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర : ప్రైవేట్ వ్యాపారం సాఫీగా కొనసాగటానికి వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి యధేచ్ఛగా నీటి దోపిడి జరుగుతుంది. అధికారుల అండదండలతో ఈ తతంగం నెల రోజులుగా కొనసాగుతుంది. ఈ వైనం అందోల్ మండలంలోని కన్సాన్పల్లి శివారులో చోటుచేసుకుంది. ఓ ప్రేవేట్ వ్యక్తి వట్పల్లి మండలంలోని బుడ్డాయిపల్లి గ్రామంలో తనకు సంబందించి పొలంలో చేపలు పెంపకం కోసం పనులు పూర్తిచేశాడు. చేపల పెంపకం కోసం పెద్ద మొత్తంలో గుంత తీశారు. దీనికి అవసరమయ్యే నీటిని సమీపంలోని అందోల్ మండల శివారులోని కన్సాన్పల్లి పెద్ద చెరువు నుంచి నీటిని తరలించడానికి యధేచ్ఛగా జేసీబితో ఏకంగా కిలోమీటర్పైగా కాలువ తీశాడు. ఇంతే కాకుండా చెరువు వద్ద భారీ మోటార్లు బిగించి అక్రమంగా విద్యుత్ వాడుకుంటు నీటిని తరలించాడు. ఈ విషయంలో గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన చెరువు నుంచి నీటిని తరలించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ సంఘటనను అరికట్టడానికి పూనుకున్నారు. సోమవారం పంచాయతి ఆద్వర్యంలో నీటి దుర్వినియోగంపై చాటింపు చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్తులు అక్రమంగ తరలిస్తున్న నీటిని అడ్డుకునేందుకు మూకుమ్మడిగా చెరువు వద్దకు తరలివెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారుల బృందం డీఈ రవిమోహన్ ఆద్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా ప్రైవేటు చేపల చెరువులకు తరలించడం వల్ల భవిష్యత్తులో గ్రామాల నీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈ విషయంపై డీఈ రవికుమార్ వివరణ:-**

అనుమతులు లేకుండా చెరువులో కాలువలు తవ్వి నీటిని తరలించడం నిబంధనలకు విరుద్ధమని డీఈ రవిమోహన్ తెలిపారు. కాలువ పూడ్చివేసేందుకు చేపల చెరువు యజమానికి ఆదేశించినట్లు ఆయన చెప్పారు. లేకుంటే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# అవసరమైన వారికి ఎల్ వో సీ

**- నిమ్స్ లో వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత...**



నిజామాబాద్ ఆగస్టు18: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నియోజకవర్గంలో అవసరమైన వారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని సారంగాపూర్ కు చెందిన కల్పన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాదులోని బీ బీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రసికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్లతో నిర్మించి, పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు.

# “శ్రీశైలానికి కొనసాగుతున్న జూరాల వరద“

**- “876 అడుగులకు చేరిన నీటిమట్టం... పూర్తిస్థాయికి 9 అడుగులే దూరం“**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 18:

ఎగువ నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం కళకళలాడుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి వదులుతున్న నీరు నేరుగా శ్రీశైలానికి చేరుతుండటంతో డ్యాంలో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు శ్రీశైలం డ్యాం నీటిమట్టం 876 అడుగులులిగా నమోదైంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కావడంతో ఇంకా 9 అడుగులే తేడా ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు. ప్రస్తుతం డ్యాంలో 168.2670 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే మరో 2–3 రోజుల్లో డ్యాం పూర్తిస్థాయికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**జూరాల నుంచి భారీ ఇన్‌ఫ్లో**

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టు నిండడంతో అక్కడి నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జూరాల నుంచి 37,237 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి చేరుతోంది. ఈ నీరంతా కృష్ణానది ద్వారా శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది.

**సాగర్‌కు భారీగా విడుదల**

శ్రీశైలంలోకి వస్తున్న ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తుగానే దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 44,753 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ ఆయకట్టుకు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. డ్యాం వద్ద సిబ్బంది 24 గంటల పాటు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. నీటిమట్టం 885 అడుగులకు చేరిన వెంటనే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

**పర్యాటకుల సందడి**

వరద నీటితో శ్రీశైలం డ్యాం, పాతాళగంగ అందంగా కనిపిస్తుండటంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. వీకెండ్ కావడంతో హైదరాబాద్, బెంగళూరు, కర్నూలు నుంచి భక్తులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. డ్యాం వద్ద సెల్ఫీలు దిగుతూ వరద అందాలను తిలకిస్తున్నారు. అయితే నీటిలోకి దిగవద్దని, గేట్ల వద్దకు వెళ్లవద్దని అధికారులు పర్యాటకులను హెచ్చరిస్తున్నారు.

# కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేయాలనే కాంగ్రెస్ కుట్ర చేస్తుంది,

**- ఎన్నికల్లో ఇచ్చిన హామీ తులం బంగారం ఏమైంది అని నిరసనలు చేసిన కోవ లక్ష్మీ...**





అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు18, (విజన్ ఆంధ్ర) బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా లోని అన్ని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు పిలుపునివ్వడంతో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు, పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా ఇస్తున్న కల్యాణలక్ష్మి – షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం నిరసన కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ మాట్లాడుతూ, హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది.ముఖ్యమంత్రి, మంత్రుల అవినీతి కేసుల కోసం కోట్లు ఖర్చుపెట్టి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం, పేద ఆడబిడ్డల పథకం కోసం మాత్రం కోర్టులో కౌంటర్ కూడా వేయలేదు. ఎన్నికల్లో ‘తులం బంగారం‘ ఇస్తామని హామీ ఇచ్చి, ఉన్న కల్యాణలక్ష్మిని పూర్తిగా రద్దు చేసే కుట్రకు పాల్పడుతున్నారు. తెలంగాణ ఆడబిడ్డల తరపున బి ఆర్ స్ పార్టీ ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కల్యాణలక్ష్మి – షాదీ ముబారక్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమాల్లో బి ఆర్ స్ పార్టీ మున్సిపాల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆసిఫాబాద్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోడుప్పల్ లో బంగారు మైసమ్మ బోనాలకు ఏర్పాట్ల సమిక్ష

**- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు సమాయత్తమవుతున్న అధికారులు**



బోడుప్పల్,ఆగస్ట్ 18(విజన్ ఆంధ్ర) : ఈ నెల 23న నిర్వహించనున్న బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ కమిషనర్ శైలజ, మేడిపల్లి సీఐ జలేందర్ లు ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్,బోడుప్పల్ డివిజన్ ఆధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్యక్షుడు పొగుల దీలీప్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్లు పొగుల నర్సింహారెడ్డి,రాసాల వెంకటేష్‌యాదవ్,చీరాల నర్సింహ్మా,ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పట్టణంలో జరిగే ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల నరసింహ .**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): ఆగస్టు 18 ఏఐటీయూసీ నాగర్ కర్నూల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ హాజరై మాట్లాడుతూమాట్లాడుతూ 2026 సెప్టెంబర్ 6 నుండి 8 వరకు కరీంనగర్లో రాష్ట్ర మహాసభలు జరుగును కార్మికులు, కార్మిక శ్రేయోభిలాషులు అభిమానులు సానుభూతిపరులు నాగర్ కర్నూల్ జిల్లా నలుమూలల నుండి కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు, 1886 సంవత్సరం అమెరికాలోని చికగో నగరంలో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి,8 గంటల వినోదానికై సాగిన పోరాటాలు ఉద్యమాల ద్వారా చరిత్రాత్మకమైన సమ్మె 18 గంటల పనిని రద్దుచేసి, 8 గంటల పని దినాన్ని మే 1న సమ్మెపై దాడులు దౌర్జన్యాలు చేసి ఎన్ని మంది కార్మిక నాయకుల పోరాటాలలో అమరులు కాగా, వేలాదిమంది కార్మికులు రక్త తర్పణ చేశారు, వారి ఫలితంగా 8 గంటల పని దినం అమలు అయ్యి, ప్రపంచ కార్మికులకు పోరాట తత్వాన్ని రగిలిచ్చి నేటికీ కార్మికుల పోరాటాల ఉద్యమాల ద్వారా కార్మికుల రక్తంతో తడిచిన ఎర్రజెండా యావత్తు ప్రపంచంలోరెపరెపలాడుతూ పోరాడ తత్వాన్ని గుండెల నిండా నింపుకున్న ఎర్రజెండా నీడలో కార్మిక రాజ్యాలు ఏర్పాటు లోకానికిమార్గదర్శకత్వంవహిస్తున్నాయి భవిష్యత్తులో కార్మిక రాజ్యం వస్తుంది, 1952 వరకు కార్మికులు ఐక్యంగా రాజకీయాలకు అతీతంగా పోరాటాలు, ఉద్యమాల చేస్తూ బ్రిటిష్ ప్రభుత్వం మెడల్వంచి 1923లో ప్రమాద నష్టపరిహార చట్టం, 1926లో ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసుకొని చట్టం, వేతనాల చెల్లింపు చట్టం 1936, పారిశ్రామిక వివాదాల చట్టం 1947, కనీస వేతనాల చట్టం 1948, ఫ్యాక్టరీల చట్టం 1948, ఈఎస్ఐ చట్టం 1948, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996, హక్కు చట్టం 2005, ఉపాధి హామీ చట్టం 2005, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక చట్టాలను దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ పోరాటాల ద్వారా అనేక చట్టాలను సాధించిన ఘనత దక్కిందని ఏఐటీయూసీకిదక్కిందన్నారు,మారేడు శివశంకర్ ఏఐటియుసి నాగర్కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను తెచ్చి కార్పొరేట్లకు మేలు చేస్తుంది, ఇప్పటికే భారత దేశ కార్మిక రంగం బి ఎం ఎస్ మినహా ఇతర అన్ని కార్మిక సంఘాల ఐక్యంగా పోరాటాలు చేస్తుంది, 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలనుపునరుద్దావించాలని 28 సార్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు చేసిన కేంద్ర ప్రభుత్వం దున్నపోతుపై వర్షం పడ్డట్లు వ్యవహరిస్తుందని అన్నారు, కార్మికుల హక్కుల సాధనకై కరీంనగర్ పట్టణంలో జరిగే మహాసభలను జయప్రదం చేయండి అనినాగర్కర్నూల్ జిల్లాకార్మికులందరికీపిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాగర్కర్నూల్ జిల్లా సహాయ కార్యదర్శి మాడుగుల నరసింహ, బండి లక్ష్మీపతి, ఉప ప్రధాన కార్యదర్శి తుమ్మల శివుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, చిన్నపాగ శ్రీనివాసులు, శేఖర్, మధు, ఐ ఎం ఎఫ్ ఎల్ డిపో, ఆటో యూనియన్ నాయకులు దేశమోని సైదులు, హమాలి యూనియన్ జిల్లా నాయకులు ఆరు యాదయ్య, తిరుపతమ్మ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు,

# సూర్యాపేటలో పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా..!




సూర్యాపేట ఆగస్టు 18:(విజన్ ఆంధ్ర) : మేం ఇంజనీరింగ్ చేయాలంటే మళ్లీ ఇంటర్ చేసి రావాలా అని పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నాకు దిగారు.మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్ కళాశాల నుండి కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా మీదుగా ఎస్ వి కాలేజ్ దగ్గర శక్తి పథకాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తెచ్చిన శక్తి స్కీమ్ వల్ల మా మూడేళ్ల చదువు వృథా అవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడు తాము ఇంజినీరింగ్ చేయాలంటే మళ్లీ ఇంటర్ చేసి రావాలా..? అని రేవంత్ సర్కారును ప్రశ్నించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో జీవో 97ని తీసుకొచ్చి డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం వల్ల డిప్లొమా విద్య ప్రాధాన్యత తగ్గుతుందని విద్యార్థులు అంటున్నారు.జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసన చేపట్టారు.పిడిఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, విద్యార్థి సంఘం నాయకులు సింహాద్రి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.ప్రభుత్వ స్కీమ్ వల్ల సాంకేతిక విద్యా మండలి స్వతంత్రత దెబ్బతింటుందని, డిప్లొమాను సాధారణ శ్రామిక శిక్షణగా మారుస్తున్నారని ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ను రద్దు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అసలు ఎవరిని అడిగి ఈ స్కీమ్ తెచ్చారని విద్యార్థులు మీడియాతో నిలదీస్తున్నారు. రేవంత్ రెడ్డి తెచ్చిన శక్తి స్కీమ్ వల్ల డిప్లొమా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అంటున్నారు. ఈ రిషిత, సాహితి, హాసిని, రక్షణ, నవీన, గాయత్రి, సుహాని, సిరివెన్నెల, మనిషా, రుచిత, బ్లెస్సి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్న జీవితం ఆదర్శనీయం

**- పేట టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గావినోళ్ల శ్రీనివాస్**



నారాయణపేట, ఆగస్టు 18 ( విజన్ ఆంధ్ర) : సర్దార్ సర్వాయి పాప న్న గౌడ్ జీవితం ఆదర్శనీ యమని నారాయణపేట జిల్లా టి ఆర్ ఎస్ అద్యక్షు డు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు.పాపన్న జయంతి సందర్భంగా దామరిగిద్ద మండలం బాపన్ పల్లిలో టి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూసామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు.సర్దార్ సామాజిక సమానత్వానికి ప్రాధాన్యత ఇచ్చిన నాయ కుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆయన వీరత్వం, పరిపాల నా దక్షత, ప్రజలతో మమేక మైన నాయకత్వం నేటి తరానికి కూడా స్ఫూర్తిదా యకమని తెలిపారు.పాపన్నగౌడ్ చరిత్రను తరతరాలకు అందించ డంలో తెలంగాణ జానపద కళాకారులు, ప్రజా గాయకులు, గ్రామీణ కళాకారులు కీలక పాత్ర పోషించారని అన్నారు. పాపన్నగౌడ్ నిర్మించిన కోటలు, ఆయన సైనిక వ్యూహాలు, ప్రజలను సమీకరించిన విధానం, స్వయం పాలన కోసం చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక అధ్యాయ మని అన్నారు. ఆయనను కేవలం ఒక కులానికి చెందిన నాయకుడిగా కాకుండా అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడిగా, బహుజన సమాజానికి స్ఫూర్తినిచ్చిన చారిత్రక నాయకుడిగా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పాపన్నగౌడ్ ఆశయాలైన ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం వంటి విలువలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని గవినోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు రంగయ్య గౌడ్, మైపాల్ గౌడ్, వై. సంతోష్, వై. రాములు, చిన్న నల్ల మాణిక్యప్ప, గ్రామ యువ కులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# వంతెన నిర్మాణంతో ప్రజలకు ప్రయాణం సులభతరం

**రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ....**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18,( విజన్ ఆంధ్ర ) : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం అంకుశపూర్ – తట్టుగూడెం మధ్య 8 కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన హై లెవెల్ వంతెన నిర్మాణానికి శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, కాగజ్ నగర్ రాజస్వ మండలాధికారి చెన్నూరి కిష్టయ్య, రోడ్డు భవనాల శాఖ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లినప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హై లెవెల్ వంతెనల నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే కాగజ్‌నగర్, వాంకిడి ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి సమీప పట్టణాలు, మార్కెట్లు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, ఇతర అవసరాలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. హై లెవెల్ వంతెన నిర్మాణంతో వరదల సమయంలో ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. వంతెన పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత అంచనాలు, సాంకేతిక ప్రమాణాల మేరకు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చెంగిచెర్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



బోడుప్పల్,ఆగస్ట్ 18(విజన్ ఆంధ్ర) : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల 12వ డివిజన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో చెంగిచెర్ల చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు,సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు.ఆయన స్ఫూర్తిగా మనమందరం ముమదుకు వెళ్ళాలని తెలిపారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కొత్త చందర్ గౌడ్,నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, రంగా బ్రమ్మన్న గౌడ్,కుర్రి శివశంకర్,కొత్త గణేష్ గౌడ్, కొత్త అశోక్ గౌడ్,కొత్త రఘుపతి గౌడ్,మేకల యాదగిరి,రాసాల కుమార్ యాదవ్,ఆసర్ల బీరప్ప,కుర్రి మహేష్, కొత్త ఆంజనేయులు గౌడ్,గండిపెల్లి సుధాకర్, కొత్త ప్రశాంత్ గౌడ్, కొత్త అజయ్ గౌడ్, కొత్త అభినవ్ గౌడ్,అజ్మీర్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలి - జిల్లా కలెక్టర్ పిలుపు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి18 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిరోధక చట్టం2006 అమలుపై సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాల్లో వివాహాల నిర్వహణ సందర్భంగా వధూవరుల వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించేలా చర్యలు చేపట్టాలని డీపీఓనుఆదేశించారుగ్రామ స్థాయిలో బాల్య వివాహాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీపీలు, సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ బాల్య వివాహాల నిరోధానికి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కాకపోతే, వారు ఎందుకు పాఠశాలకు రావడం లేదనే విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని డిఈఓ కు సూచించారు. బాల్య వివాహాలకు ఆర్థిక సమస్యలు కూడా ఒక కారణంగా ఉన్నందున, కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు కల్పించే దిశగా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని సూచించార బాల్య వివాహాలపై సత్వర చర్యలు చేపట్టేందుకు గ్రామ స్థాయిలో కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేసి బాల్య వివాహాలను అడ్డుకున్నప్పుడే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మంగళ, గురువారాల్లో నిర్వహించే శానిటేషన్ డ్రైవ్‌ల సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో బాల్య వివాహాల నిరోధక చట్టం2006తో పాటు పిల్లలకు కల్పించిన హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారుకార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు బాల్య వివాహాల నిరోధక చట్టం2006పై అధికారులకు సవివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చివరగా జిల్లా కలెక్టర్ బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన వాయిస్ ఓవర్, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీపీఓ రవీందర్ , రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక సర్వాయి పాపన్న

- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు
- హాజరైన అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : అణగారిన వర్గాల ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ కొనియాడారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ... సామాన్య కుటుంబంలో జన్మించిన పాపన్న సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపారని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించిన ఆయన పోరాట స్ఫూర్తిని, ధైర్యాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సందర్భంగా సామాజిక చైతన్య కళాకారుడు రాజారాం ప్రకాష్ పాడిన గేయాలు అలరించాయి. ఈ వేడుకల్లో ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి మధు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ నాయకులు గంధం నాగరాజు, వెంకటేష్, గౌడ సంఘం ప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్ నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో 60 శాతం వన మహోత్సవం లక్ష్యం పూర్తయిందని తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేస్తూ, నాటిన మొక్కల సంరక్షణతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ఫార్మ్ పాండ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే వేరుశెనగ, మినుములు, ఆముదం వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆగస్టు 31వ తేదీలోగా సంబంధిత కార్యాలయాల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## స్కేటింగ్‌లో జాతీయ రికార్డు సాధించిన చిన్నారులకు ఎస్పీ అభినందనలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బౌరంపేట్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో 80 నిమిషాల పాటు నాన్‌స్టాప్‌గా స్కేటింగ్ చేసి జాతీయ స్థాయి రికార్డు సాధించిన వనపర్తి జిల్లాకు చెందిన 32 మంది చిన్నారులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థులు ప్రదర్శించిన స్కేటింగ్ విన్యాసాలను ఎస్పీ తిలకించారు. అనంతరం రికార్డు సాధించిన విద్యార్థులకు, కోచ్ రాథోడ్ కిషన్, తల్లిదండ్రులకు ప్రశంసలు తెలియజేశారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు. చిన్న వయసులోనే 80 నిమిషాల పాటు విరామం లేకుండా స్కేటింగ్ చేయడం విద్యార్థుల పట్టుదలకు, కోచ్ మార్గదర్శకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై మంజునాథ్ రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్సై తిరుపతిరెడ్డి, ఎస్సై జగన్ మోహన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : అణచివేత, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కొనియాడారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని వనపర్తి నంది హిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చి, బలహీన వర్గాలను ఏకం చేస్తూ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజా యోధుడు పాపన్న గౌడ్ అని తెలిపారు. తెలంగాణ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 18,(విజన్ ఆంధ్ర); ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బాసర మండలం బిద్రెల్లి సమీపంలో ఇటీవలి భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమేరకు రోడ్లు దెబ్బతిన్నాయో అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రహదారులు ఉండాలన్నారు. అవసరమైన సూచికల బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసిల్దార్ పవన చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 'క్లిక్'మనిపించని జీవితాలు!

- సాంకేతికత పోటీలో వెనకబడుతున్న సాంప్రదాయ ఫోటోగ్రాఫర్లు!
- భారంగా మారుతున్న డిజిటల్ కెమెరాల కొనుగోలు
- స్మార్ట్‌ఫోన్ల దాటికి వెలవెలబోతున్న ఫోటో స్టూడియోలు
- ప్రభుత్వం ఆదుకోవాలి అంటున్న ఫోటోగ్రాఫర్లు
- నేడు 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజన్ ఆంధ్ర దినపత్రిక ప్రత్యేక కథనం..










బాడుగ భారంతో చేతిచమురు కాళీ

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 18 (విజన్ ఆంధ్ర) : కాలగర్భంలో కలసిపోయే తియ్యని జ్ఞాపకాలను, చరిత్రను భావితరాలకు సజీవంగా అందించే అద్భుత కళ 'ఫోటోగ్రఫీ'. అందరి జీవితాల్లోని మధుర ఘట్టాలను కెమెరాలో బంధించే ఫోటోగ్రాఫర్ల జీవితాలు మాత్రం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. నేడు 187వ 'ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం' సందర్భంగా జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై విజన్ ఆంధ్ర దినపత్రిక ప్రత్యేక కథనం...

### సాంకేతిక మార్పు.. భరించలేని ఖర్చు

జిల్లాలో దాదాపు 2,000 వేల మందికి పైగా ఫోటో, వీడియో గ్రాఫర్లు ఉన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో రోజురోజుకూ వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంప్రదాయ ఫోటోగ్రాఫర్లు అప్‌డేట్ కాలేకపోతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఫుల్ ఫ్రేమ్ కెమెరాలు, అధునాతన లెన్సుల హవా నడుస్తోంది. నీలిమబ్బుల్లోనూ కాంతివంతంగా ఫోటోలు తీసే ఈ పరికరాల ధర కనీసం రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటోంది. కష్టపడి లక్షలు వెచ్చించి కెమెరా కొనుగోలు చేసినా, ఏడాది తిరిగేసరికి మరో కొత్త మోడల్ రావడం వారికి శాపంగా మారింది. అంత పెద్దమొత్తంలో సొంతంగా కెమెరాలు కొనలేక కొందరు వ్యాపారుల వద్ద రోజుకు రూ.2,000 నుంచి రూ.4,000 వరకు అద్దె చెల్లించి కెమెరాలను తీసుకువస్తున్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా, వచ్చిన సంపాదనలో సగభాగం బాడుగకే సరిపోతోందని, తమకు నాలుగో వంతు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్మార్ట్‌ఫోన్ పంజా.. మూతపడుతున్న స్టూడియోలు

ఒకప్పుడు పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాల్లో ఫోటోగ్రాఫర్లు సందడి చేసేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ రావడం, 'సెల్ఫీ'ల క్రేజ్ పెరగడంతో వారి ఉపాధి దెబ్బతింది. ఫోటోలు ప్రింట్ తీయించుకోవడం మానేసి ఫోన్లు, హార్డ్ డిస్కులలోనే భద్రపరుచుకుంటున్నారు. దీంతో జిల్లాలోని పలు స్టూడియోలు వెలవెలబోతున్నాయి. పెరుగుతున్న విద్యుత్, అద్దె ఖర్చులను తట్టుకోలేక చాలామంది స్టూడియోలను మూసివేస్తున్నారు.

### రోల్ ఫిలిం నుంచి డిజిటల్ విప్లవం దాకా..

2000వ సంవత్సరం నుంచి డిజిటల్ ఫోటోగ్రఫీ హవా ప్రారంభమయ్యాక రోల్ ఫిలిం, కెమికల్స్, డార్క్ రూమ్‌లు కనుమరుగయ్యాయి. క్షణాల్లో ఫోటోలను కళ్లముందు ఉంచే డిజిటల్ కెమెరాలు, సెల్ ఫోన్లు రాజ్యమేలుతున్నాయి. పరిజ్ఞానం పెరిగినప్పటికీ, సాంప్రదాయ ఫోటోగ్రాఫర్ల పరిస్థితి మాత్రం 'అగమ్యగోచరం'గా మారింది.

### ప్రభుత్వం ఆదుకోవాలి..

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అధునాతన కెమెరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం బ్యాంకు రుణాలను రాయితీపై అందించాలని ఫోటోగ్రాఫర్లు కోరుతున్నారు. ప్రభుత్వం చేయూతనందిస్తేనే తాము ఈ వృత్తిలో నిలదొక్కుకోగలమని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు సరి చూసుకోవాలి

- అర్హులందరూ ఓటర్లుగా ఉండేందుకు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించినందున, ఓటర్లందరూ పోలింగ్ స్టేషన్ల వారీగా ఉన్న లిస్టులో తమ పేర్లను సరి చూసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ పై జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, తదితర అంశాలు తప్పుగా నమోదయి ఉన్నవాళ్లు సెప్టెంబర్ 16వ తేదీలోగా తమ అభ్యంతరాలను తెలియజేస్తే సంబంధిత అధికారులు సరి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 63,925 మంది ఓటర్లు ఎన్యుమరేషన్ పత్రాలను ఫిలప్ చేసి ఇవ్వలేదని, వీరంతా అర్హులైన ఓటర్లై ఉంటే సంబంధిత అధికారులను సంప్రదిస్తే తుది ఓటరు జాబితాలో నమోదవుతారని చెప్పారు. అదేవిధంగా సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనమలిస్ లిస్టులో ఉన్నారని, వీరంతా ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరికైనా ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసీల్దారుల, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగింపబడకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 2లక్ష 50 వేలు రూపాయల ఎల్ఓసి. లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల ఆగస్టు 18( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మల్దకల్ మండలం పరిధిలోని పాల్వాయి గ్రామానికి చెందిన కె. యగేందర్ తండ్రి నారాయణ కి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2 లక్ష 50 వేలు రూపాయల ఎల్ఓసి. లెటర్ ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


# షామీర్‌పేట్ కారిడార్‌పై 'SIA' ఎక్కడ?

- భూసేకరణకు ముందు సామాజిక ప్రభావాల అంచనా తప్పనిసరి కాదా?
- ప్రభావిత కుటుంబాలు.. భూములు.. ఆస్తుల వివరాలు బహిర్గతం చేయాలి
- ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేశారా?
- SIA నివేదికను ప్రజల ముందుంచాలని కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త పీవీ అభిషేక్ వినతి

దుండిగల్, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): పారడైజ్ జంక్షన్ నుంచి షామీర్‌పేట్ ORR జంక్షన్ వరకు రాజీవ్ రహదారి (SH-01)పై ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో సామాజిక ప్రభావ అంచనా (SIA) నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సామాజిక కార్యకర్త పీవీ అభిషేక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు భూసేకరణ విభాగం ప్రత్యేక గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే అధికారిక ప్రకటనల దశకు చేరినట్లు జిల్లా యంత్రాంగం వెబ్‌సైట్‌లోని వివరాలు వెల్లడిస్తున్నాయి. ధుమ్ముకుంటతో పాటు లోతుకుంట, అల్వాల్ తదితర ప్రాంతాలకు సంబంధించి భూసేకరణ ప్రకటనలు కూడా వెలువడ్డాయి.

### - భూసేకరణకు ముందు ప్రభావాలపై అధ్యయనం ఏది?

భూసేకరణ ప్రక్రియలో ప్రజలపై ప్రాజెక్టు చూపించే సామాజిక, ఆర్థిక, పర్యావరణ ప్రభావాలను సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అభిషేక్ తన వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్ని కుటుంబాలు ప్రభావితమవుతాయి? ఎన్ని ఇళ్లు, భూములు, ఇతర ఆస్తులు భూసేకరణ పరిధిలోకి వస్తాయి? ఎవరెవరు నిర్వాసితులయ్యే అవకాశం ఉంది? వంటి అంశాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో తిరుమలగిరి, కాకాగూడ, తొక్కట్ట, మచ్చబొల్లారం వంటి ప్రాంతాలు అధికారిక ప్రకటనల్లో ప్రస్తావించబడ్డాయి.




### - ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలన జరిగిందా?

ప్రాజెక్టుకు అవసరమైన భూమిని సాధ్యమైనంత కనిష్ఠ స్థాయిలోనే సేకరిస్తున్నారా? ప్రత్యామ్నాయ మార్గాలు లేదా ప్రాంతాలను పరిశీలించారా? ప్రత్యామ్నాయ భూసేకరణ సాధ్యం కాదని భావిస్తే అందుకు కారణాలేమిటి? భూసేకరణ వల్ల ప్రాజెక్టు వ్యయంపై పడే ప్రభావం ఎంత? ప్రాజెక్టు ద్వారా లభించే ప్రయోజనాలతో పోలిస్తే ఆ వ్యయం సమంజసమేనా? వంటి అంశాలను SIAలో పరిశీలించాలని అభిషేక్ కోరారు.

### - పునరావాస ప్రక్రియ కూడా కొనసాగింపు

ప్రాజెక్టుకు సంబంధించి పునరావాసం, పునరావాస పునరుద్ధరణ (R&R) ప్రక్రియకు సంబంధించిన అధికారిక వివరాలు కూడా హైదరాబాద్ జిల్లా యంత్రాంగం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. దీంతో భూసేకరణతో ప్రభావితమయ్యే వ్యక్తులకు పూర్తి సమాచారం అందించడం, వారి హక్కులు మరియు పరిహారం అంశాలపై స్పష్టత ఇవ్వడం మరింత కీలకమని అభిషేక్ పేర్కొన్నారు.

### - నివేదికను స్థానిక భాషలో అందుబాటులో ఉంచాలి

SIA నివేదికను కేవలం అధికారిక రికార్డుల్లో ఉంచకుండా.. సంబంధిత ప్రాంతాల ప్రజలకు సులభంగా అర్థమయ్యే స్థానిక భాషలో అందుబాటులో ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని కోరారు.

### - పారదర్శకతపై అధికారుల సమాధానం ఏమిటి?

పారడైజ్‌షామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఎవీణూ ఇప్పటికే టెండర్ ప్రక్రియను చేపట్టిన విషయం అధికారిక పత్రాల్లో ఉంది. ప్రాజెక్టు నిర్మాణంలో సర్వే, దర్యాప్తు, డిజైన్, నిర్మాణం తదితర పనులు జూజ విధానంలో చేపట్టనున్నట్లు టెండర్ పత్రాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భూసేకరణతో ప్రభావితమయ్యే ప్రజలకు ూజూ నివేదిక, భూసేకరణ పరిధి, ప్రభావిత ఆస్తులు, పరిహారం, పునరావాసం తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని పీవీ అభిషేక్ కోరుతున్నారు. ఆయన వినతిపై జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రజా ప్రయోజనంతో ముడిపడిన భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో అభివృద్ధితో పాటు ప్రభావితుల హక్కులు, పారదర్శకతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి జూపల్లి

**- అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కృషి చేయాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**




సిర్పూర్ ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర ) కొమురం భీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని లిలిఎస్ఐఆర్ ఫేజ్-2 ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. సిర్పూర్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్-2 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఓట్లు అనమాలీస్ జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అందులో అర్హులైన ఓటర్ల పేర్లు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. నోటీసుల కోసం ఎదురుచూడకుండా అవసరమైన ఆధారాలతో ఫారం-7 సమర్పించి అర్హులైన ప్రతి ఓటు హక్కును కాపాడాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి నిరంతరం సమీక్షలు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లకు మంత్రి సూచించారు. ప్రతి బూత్‌లో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి అనమాలీస్ జాబితాను పరిశీలించాలని సూచించారు. అవసరమైన ఆధారాలను సేకరించి అభ్యంతరాలను నమోదు చేయడంతో పాటు, ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. మన ఓటు హక్కును మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ఆత్రం సుగుణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపాలిటీ చైర్మన్లు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి న్యూసెన్స్.. ఐదుగురికి జరిమానా

**- కోర్టు ఆదేశాలతో పోలీస్ స్టేషన్, కోర్టు పరిసరాల్లో స్వచ్ఛ భారత్**



బోడుప్పల్,ఆగస్ట్ 18(విజన్ ఆంధ్ర) : మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడిన ఐదుగురిపై మేడిపల్లి పోలీసులు పెట్టీ కేసులు నమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నెల 9, 11, 15, 17 తేదీల్లో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఘటనల్లో చెంగిచెర్ల ఇందిరానగర్ కాలనీకి చెందిన వై. మహేందర్ (31), షేర్‌లింగంపల్లి పాపిరెడ్డి చందర్‌నగర్ చెందిన ఉదయ్ కిరణ్ (25),ప్రతాపసింగారం డబుల్ బెడ్‌రూమ్ కు చెందిన డి. పాషా (32),చెంగిచెర్ల క్రాంతి కాలనీ వరప్రసాద్ (47), ప్రతాపసింగారం డబుల్ బెడ్‌రూమ్ యకయ్య (35),వీరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసులకు సంబంధించి నిందితులను ఎల్‌బీనగర్‌లోని 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయస్థానం నిందితులకు జరిమానాతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించింది.కోర్టు ఆదేశాల మేరకు నిందితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్, కోర్టు పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## తాండూర్ కళాక్షేత్రం కళాకృతి పెయింటింగ్స్-2026లో ములుగు చిత్రకారుడు కొత్త రేవంత్ ప్రతిభకు ప్రశంసలు



ములుగు ఆగస్ట్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బితాండూర్ కళాక్షేత్రంబి ఆధ్వర్యంలో నిర్వహించిన "కళాకృతి పెయింటింగ్స్ - 2026" కార్యక్రమం కళా ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పలువురు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇందులో బిములుగు జిల్లాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు "కొత్త రేవంత్‌బి" పాల్గొని తన ప్రత్యేక శైలి చిత్రాలతో అందరి దృష్టిని ఆకర్షించారు. "కొత్త రేవంత్" గీసిన బిఆదివాసీ గిరిజన నాయకుల చిత్రాలు, నాయకపోడు పెయింటింగ్స్‌బి సందర్శకులకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గిరిజన జీవన విధానం, సంస్కృతి, పోరాట స్ఫూర్తిని ఆయన కాన్వాస్ పై అద్భుతంగా చిత్రీకరించారు. రంగులు, గీతల ద్వారా ఆయన కళలో కనిపించిన సజీవత్వం, భావోద్వేగం అందరినీ మెప్పించాయి. కార్యక్రమానికి వచ్చిన కళా విమర్శకులు, సందర్శకులు కొత్త రేవంత్ కళను ప్రత్యేకంగా ప్రశంసించారు. తెలంగాణ సంస్కృతిని యువ చిత్రకారుడు ఇంత చక్కగా ఆవిష్కరించడం గర్వకారణమని కొనియాడారు. ఆయన చిత్రాలు కేవలం పెయింటింగ్స్ గా మాత్రమే కాకుండా, గిరిజన సమాజ చరిత్రను, వారి త్యాగాలను భావి తరాలకు తెలియజేసే పత్రాలుగా నిలుస్తాయని అన్నారు. తన కళ ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెచ్చిన బికొత్త రేవంత్ కుబి ఈ సందర్భంగా అందరు అభినందనలు తెలియజేశారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళా ప్రియులు ఆకాంక్షించారు.

## ప్రభుత్వ భూముల కబ్జాపై విచారణ చేపట్టాలి: కొర్స నర్సింహా మూర్తి

**- బికలెక్టర్ కు వినతిపత్రం అందజేత**

ములుగు ఆగస్టు 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎల్‌టీఆర్ చట్టాన్ని ఉల్లంఘించి వాజేడు, వెంకటాపురం ఏజెన్సీ మండలాల్లో వలస గిరిజనేతరులు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, గిరిజనుల భూములు కబ్జా చేస్తున్నారని బిఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తిబి ఆరోపించారు.



మంగళవారం నూతన కలెక్టరేట్‌లో బిజిల్లా కలెక్టర్ హేమంత్‌బి అధ్యక్షతన జరిగిన ఎల్ నీనో, పంటల మార్పిడి, నీటి యాజమాన్యంపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 తర్వాత ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వకూడదని చట్టం ఉన్నా ఉల్లంఘనలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమ పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిపాలెం వాగు ప్రాజెక్ట్‌బి కాలువలో గండ్లు, డిస్ట్రిబ్యూటర్లకు గేట్లు లేకపోవడం వల్ల నీరు వృధా అవుతోందని, చిన్నగంగారం వద్ద ప్రధాన కాలువకు బుంగపడిందని తెలిపారు. ఒక లస్కర్‌తో పదివేల ఎకరాల ఆయకట్టును నిర్వహించడం సాధ్యం కావడం లేదని, అధికారుల నిర్లక్ష్యంతో గత రెండేళ్లుగా వేలాది ఎకరాల పంటలు ఎండిపోయాయన్నారు. కాలువ మరమ్మత్తు, పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఎరువుల ఆన్‌లైన్ విధానంబి ఏజెన్సీ రైతులకు కష్టంగా మారిందని, నిరక్షరాస్య రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజిల్లా కన్వీనర్ కుంజ మహేష్, ముర్రం రామలక్ష్మి, పద్మబి తదితరులు పాల్గొన్నారు.

## నా భూమి విషయంలో సంబంధం లేని వ్యక్తుల నుండి నన్ను కాపాడండి ..



సూర్యాపేట ఆగస్టు 18:(విజన్ ఆంధ్ర) : నా భూమి విషయంలో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడు ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పెండెం కృష్ణ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని గాంధీ నగర్ తన సొంత భూమి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 1982లో భూమిని కొనుగోలు చేశానని, సూర్యాపేట 13వ వార్డు గాంధీనగర్‌లో తనకు మొత్తం 27 ఎకరాల భూమి ఉందని తెలిపారు.తనకు చెందిన 27 ఎకరాల భూమిలో 2019లో గాలి సుధీర్, ఎస్. వెంకటరమణలకు భూమి విక్రయించానని తెలిపారు. అయితే మొత్తం 27 ఎకరాలకు గాను వారు 13 ఎకరాల భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన 10 ఎకరాలకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదని పేర్కొన్నారు. దీంతో ఆ 10 ఎకరాల భూమి చుట్టూ తాను కంచె ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నానని తెలిపారు. అయితే వట్టే జానయ్య యాదవ్‌కు తన భూమితో ఎలాంటి సంబంధం లేదని కృష్ణ స్పష్టం చేశారు. తాను జానయ్య యాదవ్‌కు ఎలాంటి భూమి విక్రయించలేదని, ఆయనకు భూమి ఎక్కడ ఉందో ఆయన చూసుకోవాలని అన్నారు. తాను భూమి విక్రయించింది గాలి సుధీర్, ఎస్. వెంకటరమణలకు మాత్రమేనని తెలిపారు.గతంలో కూడా ఇదే విధంగా తనను ఇబ్బందులకు గురిచేసిన సందర్భంలో భూమికి సంబంధించి సర్వే చేయించానని కృష్ణ చెప్పారు. తన భూమిని తాము కొనుగోలు చేసినట్లు చెబుతున్న వారు అందుకు సంబంధించిన పత్రాలు చూపించాలని కోరితే, కంచెను పలుమార్లు తొలగించారని ఆరోపించారు. తాను ఏర్పాటు చేసుకున్న కంచెను మూడు సార్లు తొలగించే ప్రయత్నం జరిగిందని తెలిపారు.తనకు సంబంధం లేని వ్యక్తులు భూమి విషయంలో జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమికి సంబంధించిన వాస్తవాలను పరిశీలించి, అనవసరంగా తనను వేధింపులకు గురిచేయకుండా చూడాలని ఆయన కోరారు.

# చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోండి

**- టీపీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు**

**- కన్నతల్లి లాంటి కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు**

**- సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న మహేష్ కుమార్ గౌడ్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గాంధీ భవన్‌కు చేరుకుని తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, తమకు కాంగ్రెస్ కేవలం రాజకీయ పార్టీ కాదని, కన్నతల్లి లాంటిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందని ఆరోపించడం, సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం పార్టీ క్రమశిక్షణకు తీవ్ర విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని, పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు సృష్టించేలా మాట్లాడటం తగదని విమర్శించారు.

తీవ్రంగా పరిగణిస్తున్నాం: టీపీసీసీ అధ్యక్షుడు

ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేపట్టి, పార్టీ పెద్దలతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులకు అభిప్రాయ స్వేచ్ఛ ఉన్నప్పటికీ, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా, అధినేతను కించపరిచేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని, ఈ వ్యవహారాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్

**- మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం జిల్లా కలెక్టర్**



కొల్లాపూర్ ఆగస్టు 18 :(విజన్ ఆంధ్ర) : మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలనలో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు, వారికి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రెవెన్యూ, ఐకేపీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి గ్రామ శివారులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119లో ఉన్న సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన ఆయన, ప్లాంట్ ఏర్పాటుకు ఆ స్థలం ఎంతవరకు అనుకూలంగా ఉంటుందనే అంశంపై అధికారులతో చర్చించారు.సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థల స్వరూపం, రహదారి సౌకర్యం, విద్యుత్ ప్రసారానికి ఉన్న అవకాశాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఒడ మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ వనరు సమకూరే అవకాశం ఉందని, అందుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని, ప్రతిపాదిత సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యాసాధ్యాలను అంచనా వేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్రసారం తదితర అంశాలపై పూర్తి వివరాలతో ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీఓ, ఐకేపీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక..!

**- సర్పంచులు గ్రామాలను ఆదర్శవంతమైన తీర్చిదిద్దాలి**

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**




ధరూర్ ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు గద్వాల నియోజకవర్గంలో సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి పై అవగాహన సదస్సు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రోగ్రాం ఇంచార్జ సురేష్ హాజరయ్యారు.ఎమ్మెల్యే కి మాజీ వైస్ ఎంపీపీ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఇంచార్జ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క ఆధ్వర్యంలో గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలు సర్పంచులు గ్రామాలలో ఒక ప్రణాళిక బద్ధంగా క్రమబద్ధంగా ఒకదాని తర్వాత ఒకటి గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామాలలో ముందుగా పారిశుద్ధ్యము , పచ్చదనను స్వచ్ఛతను ఏర్పాటు చేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గం లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామపంచాయతీ పైన అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ఆలోచించి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి కార్యక్రమం గ్రామ పంచాయతీలు సర్పంచులు నిర్వహించాల్సిన విధివిధానాలు గురించి వివరించారు.గతంలో గత ప్రభుత్వంలో సర్పంచులు గ్రామాలలో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేశారు వైకుంఠ ద్వామాలు, డంపింగ్ యార్లు, రైతు వేదికలు పల్లె ప్రకృతి వనాలు అంటే కార్యక్రమాలను నిర్వహించడంతో గ్రామాలలో చిరస్థాయి మైన గా ఉన్నది ఫలానా సర్పంచ్ పదవి కాలంలో అభివృద్ధి కార్యక్రమం జరిగిందని తెలుస్తుంది అని తెలిపారు. కాబట్టి నూతనంగా ఎన్నికైన సర్పంచులు కూడా ప్రస్తుతం ఈ గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడి భవనాలను మహిళ భవనాలను, వ్యవసాయ గోదాములు గ్రామంలో నిర్మాణం చేయడం వల్ల పలానా సర్పంచ్ పదవి కాలంలో ఈ అభివృద్ధి కార్యక్రమం జరిగిందని గ్రామాలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామ అభివృద్ధి కొరకు సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ సమన్వయంతో పనిచేసే గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కావాలని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, జెడ్పి సీఈవో, ఎంపీడీవోలు అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యలో జీవో 97ను రద్దు చేయాలి

**- షాక్తి పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థుల ఆందోళన.. కలెక్టరేట్ ఎదుట ధర్నా**



భూపాలపల్లి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): పాలిటెక్నిక్ విద్యను షాక్తి/స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవస్థతో అనుసంధానం చేసే చర్యలను వ్యతిరేకిస్తూ రుద్రారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్‌లో అర్హత సాధిస్తే ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే కొత్త విధానంతో పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో చేరాలంటే మొదటి సంవత్సరం నుంచే చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీంతో తమ విద్యా ప్రగతిలో ఒక సంవత్సరం ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ అనేది ఐటీఐ విద్యకు భిన్నమైన ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సు అని, దాని ప్రత్యేకతను కాపాడాలని కోరారు. డిప్లొమా గుర్తింపు, బీటెక్ లేటరల్ ఎంట్రీ, ప్రభుత్వ ఉద్యోగాల అర్హతలకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, అధ్యాపకులతో సంప్రదింపులు జరిపిన అనంతరమే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు విద్యార్థులు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగడంతో అధికారుల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు ఆందోళన విరమించకపోవడంతో విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐసా విద్యార్థి సంఘం అధ్యక్షురాలు బుర్ర స్వాతి, జిల్లా కార్యదర్శి బందు సుజాత, ఎస్ఎస్‌కే సాగర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్, ఆర్‌వైఏ జిల్లా కార్యదర్శి ఆత్కూర్ శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్, రుద్రారం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.


## బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**- బహుజన కులాల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వగ్గు చంద్రశేఖర్ రావు,**



మల్కాజిగిరి, ఆగస్ట్ 18, (విజన్ ఆంధ్ర): తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బహుజన కులాల చైతన్య వేదిక మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం వ్యవస్థాపక అధ్యక్షులు వగ్గు చంద్రశేఖర్ రావు అన్నారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా నేరేడ్ మెట్ చౌరస్తా లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భరతమాత ముద్దుబిడ్డ, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. మొగలుల దౌర్జన్యాలని ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన విరుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు.సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచి పోతుం దని, వారి స్ఫూర్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శన మన్నారు. వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం ద్వారా సబ్బండ వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించిన పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగిద్దామన్నారు. కుల, మతాల వివక్షత లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో, భాగస్వా మ్యం కావాలనే సమ సమా జ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పోరా డిన మహనీయుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్ర మంలో బిజెపి మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షు లు గున్నాల లక్ష్మణ్ గౌడ్, బహుజన నాయకులు అప్పాల శ్రీనివాస్ పటేల్, బిఆర్ఎస్ నాయకులు జోగు శ్రీనివాస్, బిజెపి నాయకులు సత్యనారాయణ, టిడిపి నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు

## బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



ములుగు ఆగస్టు 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అని బివిగ్రహ కన్వీనర్ చిర్ర సుమన్ గౌడ్‌బి కొనియాడారు. బిముచ్చర్ల గౌడ సంఘంబి ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ గౌడ్ మాట్లాడుతూ సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించిన పాపన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల కోసం పోరాడారని అన్నారు. ఆయన ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం కోసం యుద్ధం చేసిన మహాయోధుడని కొనియాడారు. ఆనాటి ప్రభుత్వం పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిందని, ఈనాటి ప్రభుత్వం ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పాపన్న స్ఫూర్తితో బహుజన వర్గాలు రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిగౌడ సంఘం అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్, చిర్ర సోమయ్య గౌడ్, చిర్ర రామన్న గౌడ్, రాపర్తి రాజేందర్ యాదవ్, మదూరి మనోహర్‌బి తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండను తెలంగాణలోనే నంబర్-1 కార్పొరేషన్‌గా తీర్చిద్దుతాం

- 23.85 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన
- సమస్యలు లేని పట్టణమే లక్ష్యం-24 గంటల తాగునీరు, సిసి రోడ్లు,సెంట్రల్ లైటింగ్



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,ఆగస్టు19(విజన్ ఆంధ్ర): నల్గొండ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. పట్టణంలో సిసి రోడ్లు,డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్,24 గంటల తాగునీరు,విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలు కల్పించి సమస్యలు లేని పట్టణంగా మారుస్తామని స్పష్టం చేశారు.మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేశారు.ముందుగా మంత్రి 3వ డివిజన్‌లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా అద్దంకి రహదారి వరకు నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి,రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.వర్షాకాలంలో ముంపు సమస్యతో ఇబ్బంది పడుతున్న ఆ ప్రాంత ప్రజలకు ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు 3 కిలోమీటర్ల మేర వన్ టైం



ఇంప్రూవ్‌మెంట్ కింద14.45 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో సిసి రహదారులు,డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయనివివరించారు.మారుమూల శివారు ప్రాంతాలను కూడా కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.24 గంటల తాగునీరు 383 కోట్ల ప్రాజెక్టులు పట్టణంలో రహదారులతో పాటు సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్,విద్యుత్,త్రాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు.పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయగా,నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని తెలిపారు.పట్టణానికి తాగునీటి కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్లు తీసుకొచ్చామన్నారు. ఇదివరకే పట్టణంలో 125 కోట్ల రూపాయలతో 12 తాగునీటి ట్యాంకులు చేపట్టగా,అందులో ఒకటి పూర్తయిందని,డిసెంబర్ నాటికి మిగిలిన 11 వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తవుతాయని వెల్లడించారు.విద్యుత్,పార్కులు,గుట్టల అభివృద్ధి పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రధాన కాలనీలతో పాటు శివారు గ్రామాలలో కూడా ఒక్కొక్కటి 3 కోట్ల రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్లు మంజూరు చేశామన్నారు.పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమున్న చోట స్మశాన వాటికలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులను కట్టిస్తున్నామని చెప్పారు. పట్టణంలో లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్ల రూపాయలతో రహదారులను మంజూరు చేయగా పనులు పురోగతిలోఉన్నాయని,అంతేకాక రోప్ వే కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ఛాయా సోమేశ్వర దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్లు-మహిళా సంఘాలకు చేయూత పట్టణానికి మొదటి విడత 700 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఈ నెల15న గొల్లగూడ సమీపంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లనునిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేసేందుకు ఇటీవలే 3 కోట్ల రూపాయలతో పెట్రోల్ పంపును ప్రారంభించామని,2 కోట్ల రూపాయలతో సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని చెప్పారు.అంతేకాక మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గోదాముల నిర్వహణ,రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి చేయిస్తున్నామని, సంఘంలో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పాటు కావాలని సూచించారు. విద్యా సంస్థల అభివృద్ధిపట్టణానికి నడిబొడ్డున ఉన్న నాగార్జున కళాశాల బ్లాక్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, తెలంగాణలోనే మొదటి కళాశాలగా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సమస్యలు కూడా తీరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు,మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు,రాజకీయాలకు అతీతంగా నల్గొండ కార్పొరేషన్‌ను మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. రహదారుల ఏర్పాటుతో పాటు డివైడర్లు,సెంట్రల్ లైటింగ్,హైమాస్ లైటింగ్,సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభ వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్,ఈఈ శ్రీధర్ రెడ్డి,డీఈ గణేష్,ఆర్ డి ఓ అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరశురాం,కార్పొరేటర్లు మల్లీశ్వరి,బొడ్డుపల్లి లక్ష్మి, కవిత,వేణు,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-18(విజన్ ఆంధ్ర) : సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల (బీసీ) అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సర్వాయి పాపన్న గౌడ్ 1650 ఆగస్టు 18న ఒక సాధారణ కుటుంబం జన్మించి, అసాధారణ సాహసంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని గొప్ప పరిపాలన అందించారని ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమన్నారు. బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు, భవిష్యత్తులో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల, గ్రామ స్థాయిలో అధికారికంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిజె.రంగారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో 38 అసిస్టెంట్ ప్రొఫెసర్,1 ట్యూటర్ పోస్టుల భర్తీ

- ఈ నెల 25న గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలలో వాక్-ఇన్ ఇంటర్వ్యూ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 38 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో,01 ట్యూటర్ పోస్టును గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 39 పోస్టుల భర్తీకి అర్హత కలిగిన వైద్య అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వెల్లడించారు.అర్హత కలిగిన అభ్యర్థులు 2026 ఆగస్టు 25వ తేదీ ఉదయం 11:00 గంటలకు గద్వాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవం తదితరాలకు సంబంధించిన అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని తెలిపారు.పోస్టుల వారీగా ఖాళీల వివరాలు,విద్యార్హతలు, వయోపరిమితి,గౌరవ వేతనం, దరఖాస్తు విధానం,అవసరమైన ధ్రువపత్రాలు,నియామకానికి సంబంధించిన నిబంధనలు మరియు ఇతర పూర్తి వివరాలను జోగులాంబ గద్వాల జిల్లా అధికారిక వెబ్‌సైట్లో www.gadwal.telangana.gov.in పరిశీలించవచ్చని కలెక్టర్ తెలిపారు.అర్హత కలిగిన వైద్య అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి ప్రభుత్వ వైద్య కళాశాలకు హాజరై వాక్-ఇన్ ఇంటర్వ్యూలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మంచిర్యాలవరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆటంకాలు లేకుండా చర్యలు

-టైటిల్ క్లియర్ ఉన్న రైతులకు పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి

-కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-18(విజన్ ఆంధ్ర) : మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ముత్తారం తహసిల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల సమస్యల కారణంగా క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పోతారం, సర్వారం, ఓదేడు, లక్కారం ప్రాంతాలకు చెందిన రైతులు, నిర్వాసితులతో సమావేశంలో చర్చించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, సమస్యల కారణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రైతులకు నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ నిర్మాణ పనులు సజావుగా కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డిఓ సురేష్, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు, పోతారం,సర్వారం, ఓదేడు,లక్కారం ప్రాంతాల రైతులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలాగ కృషి చేయాలి

- విద్యార్థులకు మెమోలు జారీ చేయని ప్రైవేటు పాఠశాల పై విచారణ చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మండల విద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్‌ను సమర్థవంతంగా అమలు చేస్తూ, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సహకారంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు.ఎఫ్ ఆర్ ఎస్ హాజరు 100 శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు.ఉపాధ్యాయులు సెలవు తీసుకోవాల్సి వస్తే తప్పనిసరిగా సంబంధిత ఎంఈఓ లేదా డీఈఓ నుంచి ముందస్తు అనుమతి పొందాలని,అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను గణనీయంగా పెంచేలా క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. హాస్టళ్లలో సీట్లు లభించని విద్యార్థులను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న డ్రాప్‌బాక్స్ అంశాలను పది రోజుల్లోగా క్లియర్ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్



కోసం ఒక్కో పాఠశాలకు ఒక నోడల్ అధికారిని నియమించి, తరగతి వారీగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆధార్, అపార్ తదితర అంశాల్లో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యల కారణాలను గుర్తించి నివేదిక సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హైస్కూల్ విద్యార్థులు ఫిజిక్స్ వాల,అన్ అకాడమీ వంటి ఆన్‌లైన్ విద్యా వేదికల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి,లాగిన్ అయ్యేలా చూడాలని సూచించారు.సంబంధిత పాఠ్యాంశాల వీడియోలను ఇంటి వద్ద వీక్షించేలా ప్రోత్సహించి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. పీఎం శ్రీ పాఠశాలలకు వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధికి వినియోగించాలని, నిధులు తిరిగి వెళ్లకుండా అవసరమైన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత,పోషణ్ యాప్ నమోదు,ఆహార రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఎల్‌పీజీ సౌకర్యం ఉన్న పాఠశాలల వివరాలను పోషణ్ యాప్‌లో అప్‌డేట్ చేయడంతో పాటు, భోజనం నాణ్యతపై పాఠశాల కమిటీ అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాములు వంటి విషపురుగులు పాఠశాల ప్రాంగణంలోకి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పాఠశాలలో భద్రత,పరిశుభ్రతను పర్యవేక్షించేందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.బవిత కేంద్రంలో నిర్వహించే స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని విద్యార్థులకు ఉపయోగకరంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీని వేగవంతం చేసి సెప్టెంబర్ 5లోగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యూనిఫాంలు అందించాలన్నారు.విద్యార్థుల అవసరాల దృష్ట్యా మరుగుదొడ్ల నిర్మాణ,మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి,100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ పాఠశాలలను తరచూ తనిఖీ చేసి, విద్యా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు.జిల్లాలోని అన్ని కోచింగ్ సెంటర్లను ఎంఈఓలు తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు మెమోలు, టీసీలు జారీ చేయకుండా పెండింగ్‌లో ఉంచిన సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఎంఈఓను ఆదేశించారు. విద్యార్థులకు మెమోలు ఇవ్వని పాఠశాల యాజమాన్యంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి,అన్ని మండలాల విద్యాధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ

రిరికార్డుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం గుర్తింపు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం.

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 18 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే నిధులు వినియోగించినట్లు గుర్తించారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి చూపించిన కొన్ని తీర్మానాలు నకిలీవి గా ఉన్నట్లు పరిశీలనలో తేలింది.రికార్డుల నిర్వహణకు సంబంధించిన పత్రాలు కూడా సక్రమంగా లేవని కలెక్టర్ గుర్తించారు. దీంతో గాజులపేట పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామపంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దోమల నివారణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్ల వివరాలు, వాటి సంఖ్య, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను కూడా ఆమె పరిశీలించారు. అనంతరం గాజులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏ పాఠ్యాంశం జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బయాలజీ చదువుతున్నామని తెలపగా, చదువు ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలను బాగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్




ఆరా తీశారు. పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనం సీజ్‌కు ఆదేశం

గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనాన్ని కలెక్టర్ గుర్తించారు. గ్రామంలోని బెల్ట్‌షాపులకు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి బాధ్యులైన మద్యం దుకాణం లైసెన్స్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్, ఎం.పి.డి. ఓ , ఎం.పి. ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మిపై ధర్నాల ముందు వాస్తవాలు తెలుసుకోండి: కౌన్సిలర్ పావని

ములుగు ఆగస్టు 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కళ్యాణలక్ష్మి పథకంపై ధర్నాలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు ముందు వాస్తవాలు తెలుసుకోవాలని బిములుగు మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, 4వ వార్డ్ కౌన్సిలర్ గుంటోజు పావనిబి అన్నారు. ఈ పథకంపై 2026 ఆగస్టు 13న హైకోర్టు స్టే విధించిందని, విచారణ జరుగుతున్న సమయంలో



అమలు కావడం లేదంటూ ఆరోపించడం తప్పని ఆమె అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉచిత విద్యుత్, ₹500 గ్యాస్, మహాలక్ష్మి ₹2,500, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలవుతున్నాయని, బిమంత్రి సీతక్కబి ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించండి కానీ అబద్ధపు ప్రచారాలు చేయవద్దని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

# వీబీజీ రామ్‌జీ పథకం అమలును సమర్థవంతంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 18(విజన్ ఆంధ్ర)జిల్లా లో వికసిత్ భారత్‌గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) (ఎదీ+ =ూవీ +) పథకం అమలును సమర్థవంతంగా చేపట్టి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) సిబ్బందితో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీజీ రామ్‌జీ పథకం పనితీరు, అమలు తీరు, పురోగతి, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనులు తదితర అంశాలపై సమీక్షించారు. పథకం ద్వారా అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. కూలీలకు సకాలంలో ఉపాధి కల్పించడంతో పాటు, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో డి.ఆర్.డి.ఓ నర్సింహులు తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సేకరణను గడువులోగా పూర్తి చేయాలి

**-భూ యజమానుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**-అక్టోబర్ 15 నాటికి కూనారం ఆర్వోబీ పూర్తి చేయాలి**

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు–18(విజన్ ఆంధ్ర) : అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. భూ యజమానుల సమస్యలు, భూ వివరాలు, రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు. భూ సేకరణలో జాప్యం కారణంగా అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా అధికారులు నిరంతరం ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కూనారం ఆర్వోబీ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతం చేసి అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసి వాహనాల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ. భావ్ సింగ్ , రెవెన్యూ డివిజనల్ అధికారులు బి. గంగయ్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**- బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు**



గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా బిజెపి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో క్రిష్ణ వేణి చౌక్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి జిల్లాగ్ల బిజెపి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన చూపిన ధైర్యం, సమాజం కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మాజీ బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేస్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు అనిల్ బిజెపి సీనియర్ నాయకులు తులసి గౌడ్, సందీప్ గౌడ్, మధు గౌడ్, రఘు గౌడ్,నల్లారెడ్డి, శ్రీమన్నారాయణ, శంకర్, బిజెవైఎం నాయకులు పాండు ,మోహన్ రెడ్డి,సతీష్,రమేష్, పవన్ ,బజరంగ్ భాస్కర్,మహిల మోర్చా భారతి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# ప్రజావాణికి 113 ఫిర్యాదులు

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 ( విజన్ ఆంధ్ర ) : ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రజా ఫిర్యాదు లు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు లో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించిన 113 దరఖాస్తులను స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, , సంబంధిత శాఖలకు సంబంధించి దరకాస్తు లను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ,ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖ ల వారిగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితిగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈరోజు నుండి ప్రతి మండలం లో ఏం పి డి ఓ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించబడు తుందని, మండలాల లో ఉండే ప్రజలు ప్రతి సోమవారం మండలాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని' మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం లో బాగంగా జిల్లాకు ఉన్న లక్ష్యం మేరకు సంబంధిత అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్,జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, డి ఆర్ డి ఓ శ్రీనివాస్,జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫారం ఫండ్స్ పనులు 31లోగా పూర్తి చేయాలి.



ఊట్కూర్, ఆగస్టు 18 ( విజన్ ఆంధ్ర) : వి.బి.జి. రామ్‌జీ పథకంలో చేపడుతున్న ఫారం ఫండ్స్ పనులను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ఊట్కూర్ ఎంపీడీవో పావని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఊట్కూర్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి తండాలో జరుగుతున్న ఫారం ఫండ్స్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఊట్కూర్ మండలంలో వి.బి.జి. రామ్‌జీ పథకం కింద మొత్తం 30 ఫారం ఫండ్స్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. మండలంలో 8 ఫారం ఫండ్స్ పనులు కొనసాగుతున్నాయని మిగతా వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచి పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శివ, ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల ఆగస్టు 18( విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాద్ లోని ఎంసిఎచ్అర్ డి. లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి ని గట్టు ఎత్తిపోతల, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సమర్థ్యం పెంపునకు కృత్షతగా కలిసి సీఎం ని సన్మానించారు. గట్టు ఎత్తిపోతల పథకం ప్రస్తుత 1.3 టిఎంసి. నుండి 3 టిఎంసి.ల సమర్థ్యం పెంపు,గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.9 టిఎంసి.నుండి 15 టిఎంసి.ల సమర్థ్యం పెంపునకు కృతజ్ఞతగా నడిగడ్డ రైతులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాది అని, అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తానని నా వంతు కృషి చేస్తాను కచ్చితంగా భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి ఏ విధంగా ప్రత్యేకమైన నిధులను కేటాయించి గద్వాల నియోజకవర్గంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో తీసుకువెళ్లేవిధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో మీ ఎమ్మెల్యే కి అండగా ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ రైతాంగం ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి గారు క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన నీటిపారుదల గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లకు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయం రైతాంగానికి శాశ్వతమైన నీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దురదృష్టతో ఆలోచించడం జరిగింది. గద్వాల నియోజకవర్గం రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం రైతాంగానికి ఎంతో మేలు చేసిన విధంగా ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గం కృషి చేయాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోని నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి మంత్రి వర్గానికి గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున రైతాంగం తరపున హృదయపూర్వక ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్,జిల్లా సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గద్వాల నియోజకవర్గ రైతాంగం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి ఎంతో కీలకం

**- విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి**

**- జెడ్పిహెచ్ఎస్ ను, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



మల్దకల్ ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి ఎంతో కీలకమని, విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ గతేడాది కంటే ప్రస్తుత ఏడాదిలో టాపర్లు పెరగాలని, వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చదవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, గైర్హాజరైతే వివిధ సబ్జెక్టుల తరగతులను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకుంటే ఎక్కువ రోజులు గుర్తుంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఎఫ్ఏ1 ప్రోగ్రెస్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. వంటగదిని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఆదేశించారు. వండిన పదార్థాలను పరిశీలించి, గుడ్లను కూడా తప్పనిసరిగా విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి ఉపాధ్యాయులు కలెక్టర్ కు తెలియజేశారు. అనంతరం మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు ఇస్తుండడంతో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్లు పొందేలా సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేసి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీల వివరాలను అడిగి చేపట్టిన పనుల గురించి తెలుసుకున్నారు. జలసిరిలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అభివృద్ధి పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థలాల్లో ఎవరైనా అనధికారికంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు తీసుకున్న వారు సక్రమంగా నిర్దేశిత అద్దేలు చెల్లించడం వలన పంచాయితీకి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. గ్రామంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను తెలుసుకొని వారికి సకాలంలో జీతాలను చెల్లించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

# కూరగాయలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి

**- నానో యూరియా అమ్మకాలు పెరగాలి.**

**- మన గ్రోమోర్, రైతు అగ్రో ట్రేడర్స్ దుకాణాల తనిఖీ**

**- రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో పామ్ మొక్కలను నాటిన**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్, రైతు అగ్రో ట్రేడర్స్ దుకాణాలను జిల్లా కలెక్టర్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాలు, ఎరువుల విక్రయాలు, వాటి ధరల గురించి నిర్వాహకులతో మాట్లాడారు. వివిధ స్టాక్ రిజిస్టర్ లను, పెస్టిసైడ్స్ నిల్వలను పరిశీలించారు. రైతులు ఎక్కువగా నానో యూరియా వినియోగించేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ నినో నేపథ్యంలో వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైన కూరగాయలు, తదితర సాగుపై ఎక్కువగా దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పెస్టిసైడ్స్, సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ అంతకుముందు మల్దకల్ మండలంలోని అమరవాయి, పెద్దొడ్డి గ్రామాల్లోని పలువురు రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో పామ్ మొక్కలను అధికారులతో కలిసి నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ క్షేత్రాల్లో అంతర పంటలుగా ఆరుతడి పంటలను సాగు చేసి కూడా అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. జిల్లాలో పామ్ పంటల సాగు పెరిగేలా సంబంధిత అధికారులు రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్ పామ్ పంటలకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీపంలోని నీటి కుంట, డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ ను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, రాజశేఖర్, ఆయిల్ ఫేడ్ కార్పొరేషన్ అధికారులు కరుణశ్రీ, మంజునాథ్, అమరవాయి సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ రంగన్న, ఇతర అధికారులు, రైతులు, తదితరులున్నారు.

# చరిత్రమరచిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

**- ఆచార్య కాశిరెడ్డి వెంకటరెడ్డి పూర్వ జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లా గౌడసంఘం, పద్యపదభారతి, సాహితీసమితి సంయుక్తతంగా నిర్వహించిన సర్దారు పాపన్నగౌడ్ 376వ జయంతి ఉత్సవాలు ఘనంగ జరిగాయి.ఇందులో భాగంగా పర్వతపల్లి బందెప్ప గౌడ్ రచించిన ఐదవ శతకం శ్రీ సర్వాయి పాపన్నగౌడ్ శతకం ఆవిష్కరించి, వారి చిన్ననాటి గురువైన గోగి నాగేంద్రరావుకు పాదపూజ చేసి పుస్తకం అంకితం ఇచ్చారు. ముఖ్య అతిథి కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూసర్వాయి పాపన్న చరిత్రమరచిన వీరుడు అని అతడు మొగలాయిల టాక్సె తిరుగుబాటు చేసిన మొదటి స్వాతంత్ర్య పోరాట వీరుడు అని చెప్పారు. కుతుబ్ షాహీల తర్వాత ఆనాటి గొప్ప దుర్గశీ గోల్కొండను 1688 నుండి 1724 వరకు పాలించాడు. భువనగిరి కోటతో మొదలయి 21 కోటలను ఆక్రమించి విజయబావుటా ఎగరేసి సర్వాయి పాపన్న- సర్దారు పాపన్న ఎదిగిన తీరును వివరించారు. ప్రధానవక్త జయదేవ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ శివాజీ సమకాలీకులని ఇద్దరి యుద్ధవిద్య, పరిపాలన తీరొక్కటే అంటూ తెలంగాణశివాజీ కొనియాడారు. గౌరవ అతిథి తూర్పు మల్లారెడ్డి మాట్లాడుతూ సమాజ పరిణామానికి తోడ్పడడానికి కాలంకన్న చారిత్రక మహా పురుషుడు బిడ్డ సర్వాయి పాపన్న నవాబులను గొట్టి గరీబులకు వెట్టి అన్ని కులాల వారిని ఏకం జేసి మెల్ల మెల్లగా రాజుగా ఎదిగిన తీరును దుల్ మిట్ట శాసనం లో ఉందని వివరించారు. కార్యక్రమానికి స్థలశీ, ఆతిథ్యం ఏర్పాటు జేసిన డా. సత్యనారాయ గౌడ్ పుస్తక రచయితను అభినందించారు. సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ భద్రీనాథ్ పుస్తకం చదివించేలా చక్కటి సమీక్ష చేశారు. మధ్యలో బాలకృష్ణ గౌడ్ పాపన్న ఏకపాత్ర సభికులను అలరించింది. చివరగా పుస్తక కర్త పర్వతపల్లి బందప్ప గౌడ్ మాట్లాడుతూ పుస్తకం గురించి ఆశీర్వచనాలు, ముందుమాట రాస్తు ఎవరెవరు ఏమేమన్నారో వాటిలోని ప్రధాన వాక్యాలను సభికులకు వివరించారు. అలాగే తన పుస్తకానికి దాతృత్వం వహించిన ద్రవ్య దాతలను సన్మానించారు. పుస్తకంలోని ప్రతి విషయం రాయడానికి తన ఇంటి వారు, మిత్రులు ఎవరెవరు ఎలా సహకరించారు అనే విషయాలను పూసగుచ్చినట్లు వివరిస్తూ కంటతడి పెట్టుకున్నారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షకార్యదర్శులు మల్లికార్జున్ గౌడ్,వెంకటయ్య గౌడ్, పద్యపద భారతి వ్యవస్థాపక అధ్యక్షులు శతావధాని అంజయ్య, అధ్యక్షులు బొబ్లాదు రాఘవేంద్రచార్యులు, కార్యదర్శి లాల్ రెడ్డి లగచర్ల హమ్మయ్య గౌడ్క.బాలస్వామి నలవోలు నరసింహరెడ్డి దుబ్బాకుల కృష్ణస్వామి ఈ. సుధాకర్ గౌడ్ జీ.కృష్ణాగౌడ్ రెడ్య రాథోడ్ పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ( విజన్ ఆంధ్ర ) : సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సామాజిక సమానత్వం, బడుగుబలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఐ డి ఓ సి సమావేశం హాలు నందు ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్,ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్,మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి, సి పి ఓ వెంకటేశ్వర్లు మల్లికార్జున గౌడ్, వెంకటయ్య గౌడ్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుంతల రహదారి పొంచి ఉన్న ప్రమాదం

**- పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు**



మాగనూరు, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : మాగనూరు మండలంలోని బిటి రహదారులు గుంతలు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలకు నిలయముగా మారుతుందని మశీదిపల్లి గ్రామ సర్పంచ్ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవి సత్యారం గ్రామం దగ్గర గల పెద్ద వాగు నుంచి ప్రతిరోజు రాత్రి, పగలు,ఇసుక టిప్పర్లు అధిక లోడుతో అతి వేగంగా వెళ్లడం వల్ల బిటి రహదారులు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా 167 వ జాతీయ రహదారి వడ్వాటు గేటు నుంచి వడ్వా టు, అడవి సత్కారం, కొల్పూరు, మంది పల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా గుంతలు గుంతలు గా ఏర్పడి ధ్వంసమైనాయని వారు అన్నారు. ఈ రహదారి గుండా అత్యవసర వైద్యం కోసం వెళ్లాలన్న మధ్యలోనే ప్రాణాలు పోయే పరిస్థితి ఉందన్నారు.ప్రతిరోజు 50 ,60,సంఖ్యలో టిప్పర్లు ఇసుక లోడుతో వెళ్లడం వల్ల రహదారి పూర్తిగా ధ్వంస మౌతుంది ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వర్షాకాలం వర్షాలు కురవడం వల్ల రహదారి పై ఎదురు ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే ఈ యొక్క రోడ్డు పై పక్కకు వాహనాలను తీసుకోవాలన్న చాలా ఇబ్బందిగా ఉందన్నారు.ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్న, కాలినడకన వెళ్లాలన్న ఎదురుగా వచ్చే టిప్పర్ల స్పీడు నుంచి ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామన్నారు. రోడ్డుపై గుంతలు గుంతలుగా ఏర్పడడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి

**- గౌడ సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్ గౌడ్**



నారాయణపేట ,ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా గౌడ సంఘం కన్వీనర్ మహేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మహేష్ గౌడ్,నాగేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్,శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ దొరల గడీలను బద్దలు కొట్టి పెత్తందారులను పరుగులెత్తించిన ధీరుడు పాపన్న గౌడ్ అన్నారు.ఈ యుద్ధాలు వద్దుర కొడకా మనది గీత వృత్తి,అది చేసి బ్రతకాలని అని తల్లి సర్వాయమ్మ అన్నప్పుడు తాటి చెట్టు ఎక్కితే ఏమొస్తుందమ్మా ఇంత కల్లు తప్ప కొడితే గోల్కొండ కోటను కొట్టాలి రాజై పాలించాలి అని అన్నారని,మొగల్ రాజుల గుండెల్లో నిద్రించి సంఘటిత శక్తితో గోల్కొండ కోటను జయించి కుల వృత్తులను ఏకం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు అలాంటి వ్యక్తి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంకుబండుపై పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్ గౌడ్,నవీన్ గౌడ్,రవి గౌడ్,బాలు గౌడ్,భూమిక తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 18,(విజన్ ఆంధ్ర); విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని చెప్పారు. లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్పగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకునేందుకు అన్ని వనరులను సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. విద్య పూర్తికాకముందే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా తగిన అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్యూక్లైర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 18,(విజన్ ఆంధ్ర); సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట పటిమ, ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొఘల్, కుతుబ్ షాహీ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను, బహుజనులను ఏకం చేసి పాపన్న గౌడ్ సైన్యాన్ని తయారు చేశారని అన్నారు. పాపన్న గౌడ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. అందరం ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు అమరవేణి నర్సగౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఆయన తెగువ నేటి తరాలకు ఆదర్శమని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**- జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ ...**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18,(విజన్ ఆంధ్ర) : బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, వారి జీవిత చరిత్ర నేటి తరాలకు ఆదర్శనీయమని జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, గౌడ సంఘాల నాయకులు, బి.సి. సంఘాల నాయకులతో కలిసి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి అప్పటి మొగల్ పాలకుల అరాచకాలను ఎదిరించి గోలుగొండ పాలించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. పాలకులకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన ప్రజలకు అండగా నిలిచారని, ప్రతి ఒక్కరు పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల నాయకులు తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, గౌడ సంఘాల ప్రతినిధులు బాలేశ్వర్ గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్, కొంద్ర మనోహర్ గౌడ్, మార్క శంకర్ గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు నీరజ గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష




వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు18(విజన్ ఆంధ్ర); వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రిటైర్డ్ ఐపీఎస్ మంగళవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్లో ఉన్న పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం భూలక్ష్మి పథకం

**- మేము అధికారంలోకి రాగానే ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తాం**

**- రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాలి**

**- పేదలకు భూములు పంచాల్సింది పోయి వారి అసైన్డ్ భూములను లాక్కుంటున్నారు**

**- రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ఆర్ఆర్) నడుస్తోంది**

**- ముఖ్యమంత్రి కుటుంబం తెలంగాణ భూమాతను చెరబట్టింది**

**- రేవంత్ రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. అమలు చేసేది ఆటవిక న్యాయం**

**- 22ఏ ద్వారా ప్రభుత్వం భూ దోపిడీకీ రాచమార్గం వేసుకుంటోంది**

**- సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ద్వారా సామాజిక న్యాయం గురించి సీఎం మాట్లాడాల్సిన అనివార్యత కల్పించాం**

**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

నిజామాబాద్ ఆగస్టు17:( విజన్ ఆంధ్ర ) : తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం జరగాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి భూ లక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆమె చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామన్నారు. బంజరాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం అనేది కేవలం నినాదం కాకూడదని దాని ద్వారా విప్లవాత్మక గుణాత్మక మార్పు రావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ మార్పు కోసం తెలంగాణలో మేధావులంతా ఆలోచించి తమతో కలిసి రావాలన్నారు. ఈ నెల 6న తాము నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని తాము చెప్పామని...ఇప్పుడు అదే జరుగుతోందన్నారు. 31 నెలలుగా సామాజిక న్యాయం గురించి మాట్లాడని ముఖ్యమంత్రి ఇప్పుడు సామాజిక న్యాయం రాగం ఎత్తుకున్నారన్నారు. కానీ ఆయన చెప్పేది సామాజిక న్యాయం, చేసేది ఆటవిక న్యాయం అన్నారు. ప్రభుత్వంలో, పార్టీలో బీసీలకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం చేసే అవకాశం ఉన్న సరే చేయకుండా రాజకీయాల కోసం మాత్రమే ఆయన సామాజిక న్యాయం అంటున్నారని కవిత మండిపడ్డారు. ఎప్పుడో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం లాక్కుంటూ ముఖ్యమంత్రి కుటుంబం తెలంగాణ భూమాత చెరబట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు భూదొంగలంటూ కవిత విమర్శించారు.

***- భూలక్ష్మి ద్వారా కుటుంబానికి ఎకరం భూమి***

తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని కవిత చెప్పారు. కేవలం నినాదాల ద్వారా ఆ కల తీరదని కవిత అన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం తాము ఓ ఓ వైపు సభలు, ధర్నాలు, ఆందోళనల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతూ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. అదే విధంగా సామాజిక న్యాయ తెలంగాణ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా ఒక్కొక్కటిగా చేపడతామన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ అనేది మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం చేపట్టినప్పుడే సాధ్యమవుతుందని కవిత అన్నారు. ప్రతి కుటుంబానికి భూమి కల్పించినప్పుడే వాళ్లంతా గౌరవంగా బతుకుతారన్నారు. పేదలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ఆదీవాసీలకు భూమి అంటే ఎమోషన్, పంచప్రాణాలని కవిత చెప్పారు. అందుకే తమ పార్టీ తరఫున భూలక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామని కవిత చెప్పారు. భూమి పంపిణీకి సంబంధించి పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆధీనంలో 60 లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. నిజాం ఇచ్చిన భూములు, భూదాన్ భూములు కూడా లక్షల ఎకరాల్లో ఉన్నాయన్నారు. భూదాన్ భూములకు సంబంధించి లక్ష ఎకరాలు లెక్కలేకుండా పోయాయని వాటిని పేదలకు ఇచ్చి ఉంటే ఎంతో మేలు జరిగేదని కవిత చెప్పారు. ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి మనసు రావటం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామన్నారు.

***- ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు***

తెలంగాణ లో ముఖ్యమంత్రి కుటుంబమే భూదోపిడీకి పాల్పడుతుందని కవిత తీవ్రంగా విమర్శలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ఆర్ఆర్) నడుస్తుందన్నారు. పేదలకు భూములు పంచాల్సిన ప్రభుత్వమే పరిశ్రమల పేరుతో వాళ్ల భూములు లాక్కుంటుందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల నుంచి 30 వేల ఎకరాలు గుంజుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ, నిజాం లాంటి వాళ్లు పేదలకు భూములు ఇచ్చారని వాటికి యాజమాన్య హక్కులు ఇస్తామని ఎన్నికల సందర్భంలో మాట ఇచ్చి ఇప్పుడు వాటిని లాక్కుంటారా అని మండిపడ్డారు. పేదల భూములు గుంజుకుంటామంటే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు. ముఖ్యమంత్రి కుటుంబం, వారి ఏడుగురు సోదరుల గురించి దేశమంతా కథలు, కథలుగా చెప్పుకుంటారన్నారు. తెలంగాణ భూమాత చెరబట్టి ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ దోపిడీ చేస్తున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు అని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అన్నట్లుగా ఒకరిని గెలిపిస్తే ఇంకొందరు అధికారం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ని గెలిపిస్తే వారి ఏడుగురు అన్నదమ్ములు, శ్రీధర్ బాబును గెలిపిస్తే వాళ్ల సోదరుడు, భట్టి ని గెలిపిస్తే వాళ్ల కుటుంబం, పొంగులేటిని గెలిపిస్తే వాళ్ల కొడుకు ప్రజలపై జులుం చేస్తున్నారన్నారు. దాదాపు 2 వందల మంది ముఠా ఇలా ప్రజలపై పడి ఇబ్బందులకు గురిచేస్తుందని కవిత అన్నారు. అటు 22 ఏ పేరుతో భూ దోపిడీకి ప్రభుత్వం రాచమార్గం ఏర్పాటు చేసుకుంటుందని కవిత విమర్శించారు. గతంలో ధరణి, ఇప్పుడు భూ భారతిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. భూముల విషయంలో పేదలకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదన్నారు.




***- చెప్పేది సామాజిక న్యాయం.. చేసేది ఆటవిక న్యాయం***

ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేక వన్నె పులి అంటూ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పేది సామాజిక న్యాయం. కానీ చేసేదీ ఆటవిక న్యాయం అని కవిత అన్నారు. ఈ నెల 6 న తాము చేపట్టిన సామాజిక సంకల్ప సభ కారణంగానే ముఖ్యమంత్రి నోట సామాజిక న్యాయం అనే మాట అనివార్యంగా వచ్చిందని కవిత అన్నారు. సామాజిక అన్యాయం అనాల్సింది పోయి ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అన్నాడని ఆయన మాటలను ప్రజలు నమ్మరని చెప్పారు. నిజంగా సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే 16 మంది మంత్రివర్గంలో ముగ్గురే బీసీలు మంత్రులు ఎందుకుంటారని ఆమె ప్రశ్నించారు. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే బీసీల కోసం కేవలం 5 వేల 5 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని కవిత చెప్పారు. బీసీల సంఖ్య ఎంత మీరు చేసిన ఖర్చు ఎంత? ఇదేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. వీహెచ్ లాంటి సీనియర్ బీసీ నాయకుడికి, శివధర్ రెడ్డి అనే ఓ అధికారికి అడ్వయిజర్ పదవులు ఇస్తే వీహెచ్ కు ఇచ్చిన ర్యాంక్, జీతం ఎందుకు తక్కువగా ఉన్నాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల విషయంలో కూడా అగ్రకులాలకు ఒక విధంగా, ఇతరులపై ఒక విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్టీఐ కమిషనర్లను నియమిస్తే అందులో ఒక్క బీసీ కూడా లేదని కవిత చెప్పారు. ఇద్దరు మహిళలను మాత్రమే మంత్రివర్గంలో తీసుకొని విజయశాంతి లాంటి నేతకు అన్యాయం చేశారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటే ఇదేనా అని కవిత ప్రశ్నించారు. బీసీ మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవమానించిన సంఘటనలను గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అటు ప్రభుత్వంలో, పార్టీ లో న్యాయం చేయగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ముఖ్యమంత్రి అన్యాయం చేస్తున్నాడని కవిత అన్నారు. అలాంటి వ్యక్తి సామాజిక న్యాయం గురించి మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదన్నారు. కచ్చితంగా తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పాటు పడతామని అన్నారు.

# ఆడబిడ్డల కన్నీటిపై కాంగ్రెస్ కుట్రలు!!

**- పథకాలను ఎగ్గొడితే సీఎం కుర్చీ దించాల్సిందే**

**- మంథనిలో గళమెత్తిన బీఆర్ఎస్ నాయకులు పుట్ట మధూకర్, జక్కు శ్రీహర్షిణి, పుట్ట శైలజ**

**- విలాసాలకు వందల కోట్లు... సంక్షేమానికి పైసల్లేవా? : పుట్ట మధూకర్ (మాజీ ఎమ్మెల్యే, మంథని)**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : ప్రజల సంక్షేమాన్ని కోర్టు కేసుల మాటున బలిపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు వత్తాసు పలకడం సిగ్గుచేటు. మంత్రులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పథకాలను కొల్లగొడుతున్న సీఎంను కుర్చీ నుంచి దించాలి. సొంత ప్యాలెస్‌లు, విలాసాలకు వందల కోట్లు ఖర్చు చేసే ప్రభుత్వానికి పేదల సంక్షేమానికి పైసలు లేవా? ఎన్నికల ముందు 420 హామీలు రాసి, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసిన స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దీనికి సమాధానం చెప్పాలి. కమీషన్ల కోసం కూల్చివేతలు చేయడం, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్ మార్క్ పాలనగా మారింది.







### కల్యాణలక్ష్మి పేదింటి ఆత్మగౌరవం

**- తులం బంగారం ఎగ్గొట్టి, ఉన్న లక్షను ఊడగొడతారా?**

**- జక్కు శ్రీహర్షిణీ (మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, భూపాలపల్లి)**

కల్యాణలక్ష్మి కేవలం పథకం కాదు... పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. ఆనాడు ఓ లంబాడీ తండాలో బిడ్డ పెళ్లి కోసం దాచిన పైసలు కాలిపోతే కన్నీరు మున్నీరైన తండ్రి వేదన చూసి కేసీఆర్ ఈ పథకానికి రూపకల్పన చేశారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో చెక్కుల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. తులం బంగారం ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన నాయకులు, ఇప్పుడు ఉన్న లక్ష రూపాయలను కూడా ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నారు. కోర్టుల్లో కౌంటర్లు దాఖలు చేయకుండా నాటకాలాడుతున్న ఈ ప్రభుత్వంపై మహిళా లోకం ఉద్యమిస్తుంది.

### పేదోడి కలలను చెరిపేస్తున్న కాంగ్రెస్‌కు పాలించే హక్కు లేదు

**- వెంటనే ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి**

**- పుట్ట శైలజ (మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, మంథని)**

పదేళ్లపాటు ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేర్చి పేదోడి గుండెల్లో నిలిచింది కేసీఆర్ ప్రభుత్వం. అలాంటి మహోన్నత పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ పేదల కలలను ఛిద్రం చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలి. మాతాశిశు ఆసుపత్రి కట్టిస్తే కనీసం వైద్యులను నియమించలేని అసమర్థత స్థానిక ఎమ్మెల్యేది. కల్యాణలక్ష్మిని కొనసాగించే పూర్తి బాధ్యతను 420 హామీల రూపకర్త అయిన మంథని ఎమ్మెల్యేనే తీసుకోవాలి, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

# “పేదల పాలిటి పోరాట యోధుడు సర్దార్ పాపన్న“

**- జిల్లా వ్యాప్తంగా ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి**

**- “బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక - యువత ఆదర్శం“**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 18: వీర యోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కల్వకుర్తినియోజకవర్గం కడ్తాల్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మైసిగండి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి సమాజానికి ఆదర్శం. బీసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ గౌడ సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు...

**కల్వకుర్తి: ఎమ్మార్వో కార్యాలయం ముందు భారీ నివాళి**

కల్వకుర్తి పట్టణంలో గౌడ సంఘం మరియు బీసీ సబ్ ప్లాన్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించిన కార్యక్రమానికి గౌడ సోదరులు, బీసీ నాయకులు, యువకులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ హాజరై సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పేదల కోసం, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పాపన్న గౌడ్. ఆయన చూపిన ధైర్యం, తెగువ నేటి యువతకు స్ఫూర్తి అని కొనియాడారు.

**బీసీల అభివృద్ధికి డిమాండ్**

పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని, బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న లాంటి మహనీయుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి. బీసీలకు రాజ్యాధికారంలో తగిన వాటా ఇవ్వాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు విజయ్ గౌడ్, కార్వంగ రాజు గౌడ్, నాగేష్ గౌడ్, రవి గౌడ్, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, సైదులు గౌడ్, గజ్జె శేఖర్ గౌడ్,బాలగౌడ్ బీసీ సబ్ ప్లాన్ సభ్యులు రాజేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొని జై సర్వాయి పాపన్న అంటూ నినాదాలు చేశారు. ప్రతీ గ్రామాల్లోనూ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. పాపన్న గౌడ్ త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరం గుర్తుంచుకోవాలని, ఆయన చూపిన బాటలో బీసీలు ముందుకు సాగాలని నాయకులు సందేశం ఇచ్చారు.



## "జొన్నలగడ్డ కల్చరల్ అండ్ ఈవెంట్స్" శుభ ప్రారంభం

హైదరాబాద్ ఆగస్టు 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : కళలను ఆదరించాలి , ప్రతిభ ఉన్న కళాకారులను ప్రోత్సహించాలి, వారికి ఒక చక్కని ప్లాట్ఫామ్ ను కలిగించాలనే సదుద్దేశంతో ప్రముఖ మాస్టర్ ఫొటోగ్రాఫర్, జొన్నలగడ్డ సుధీర్ కుమార్ నేతృత్వంలో నూతనంగా "జొన్నలగడ్డ కల్చరల్ అండ్ ఈవెంట్స్ సంస్థ ('జె ఎస్ కె' కల్చరల్ అండ్ ఈవెంట్స్ ) ప్రారంభం అలాగే లోగో ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖులు, అతిథుల సమక్షంలో ఆనందోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారంవారం సాయంత్రం 'శ్రీ త్యాగరాయ గాన సభ కళావెంకట దీక్షితులు హాల్ ' చిక్కడపల్లి, హైదరాబాద్ లో నిర్వహించిన 'జె ఎస్ కె' కల్చరల్ అండ్ ఈవెంట్స్' శుభారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్.కె. వి. రమణ చారి, మాజీ ఐ.ఎ.ఎస్. పూర్వ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హాజరై "జొన్నలగడ్డ కల్చరల్ అండ్ ఈవెంట్స్ సంస్థ ను అలాగే 'జె ఎస్ కె' కల్చరల్ అండ్ ఈవెంట్స్ లోగోను లాంఛనంగా ప్రారంభించి శుభాశీస్సులను, అభినందనలను అందజేశారు. ఈ శుభారంభ కార్యక్రమానికి సభాధ్యక్షుడుగా యువకళావాహిని లంక లక్ష్మీనారాయణ వ్యవహరించగా, సభా ప్రారంభకుడుగా రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్. ఎం.కె. రాము, గౌరవ అతిథిగా కిన్నెర ఆర్ట్స్ అధ్యక్షుడు మద్దాలి రఘురామ్, విశిష్ఠ అతిథిగా త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్దన్ మూర్తి, ఆత్మీయ అతిథిగా అభినందన భవాని, శుభాశీస్సులను అందజేయడానికి వంశీ సంస్థ అధినేత శిరోమణి రామరాజు, వేదపఠనం ఆశీర్వాదం చేయడానికి వీణా పాణి శాస్త్రి హాజరై "జొన్నలగడ్డ కల్చరల్ అండ్ ఈవెంట్స్ సంస్థ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుధీర్ కుమార్ ను ప్రశంసించి, తమ సహాయ సహకారాలు ఎప్పుడూ సంస్థకు ఉంటాయని తెలుపుతూ, శుభాకాంక్షలు అందజేశారు. ముందుగా చల్లా సౌభాగ్య లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేయగా, కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను అతిధులను అలరించారు. కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ వ్యాఖ్యానాన్ని సీనియర్ జర్నలిస్ట్, గాయకుడు మతుకుమల్లి మనోహర్ అందించారు.

## సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**





మహబూబ్ నగర్ ఆగస్టు 18 విజన్ ఆంధ్ర ప్రతినిధి : సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సాధన కోసం పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ ఉచిత శిక్షణ

**-పోలీస్ కమీషనర్ వెల్లడి**



నిజామాబాద్, ఆగష్టు18:( విజన్ ఆంధ్ర ) : పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ ( కానిస్టేబుల్ / సబ్ – ఇన్స్పెక్టర్ ) ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల నిరుద్యోగ యువతి , యువకులకు అర్హత కలిగిన అభ్యర్థులకు తెలంగాణ పోలీస్ శాఖ నియామకాలకు ఉపయోగపడే విధంగా ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని వెల్లడించారు.అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అందించబడే గూగుల్ ఫామ్ లింక్ క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.23 వ తేదీ ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. నిజామాబాద్ డివిజన్ వారు విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్ మాక్లూర్ పోలీస్ స్టేషన్,ఆర్మూర్ డివిజన్ వారు క్షత్రియ ఇంజనీర్ కాలేజీ ,బోధన్ డివిజన్ వారు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీ లో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. పరీక్షా విధానం ఆబ్జెక్టివ్ విధానం లో 200 మార్కులకు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పైన తెలియజేసిన సెంటర్స్ నందు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు సెప్టెంబర్ 1 వ తేదీ నుండి అక్టోబర్ 31 తేదీ వరకు శిక్షణలో పాల్గొనవచ్చున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు 2 నెలల శిక్షణ కాలంలో 10 గ్రాండ్ టెస్ట్ లు నిర్వహించబడుతుందన్నారు . అభ్యర్థులందరికి ఉచిత స్టడీ మెటీరియల్ అందించబడుతుందన్నారు.ఇది పూర్తిగా ఉచిత కార్యక్రమమని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఎలాంటి సమాచారానికైనా క్రాంతి– 9951943656 , 8712533273. ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

**- అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం**

**- యంచ వద్ద పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలం పరిశీలన**



నిజామాబాద్, ఆగస్టు 18 :(విజన్ ఆంధ్ర )గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రణాళి కాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ముఖాముఖి భేటీ అయి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యంచ గ్రామ శివారులో ఎక్కడ పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది, అవసరమైన స్థలం అందుబాటులో ఉందా, రవాణా వసతి, ఇతర సదుపాయాలు, భద్రతాపరమైన అంశాలు తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అన్ని అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం నిర్ధారణ చేసిన ప్రాంతంలోనే పుష్కరఘాట్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలన జరిపిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఏమేరకు అందుబాటులో ఉంది, పట్టా భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయన్నది పక్కాగా సర్వే నిర్వహించి వారం రోజుల్లోపు మార్కింగ్ పూర్తి చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేలా ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులను చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయం యంచ గ్రామానికి అత్యంత చేరువలో ఉన్నందున గోదావరి పుష్కర పుణ్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలి

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**



నిజామాబాద్, ఆగస్టు 18 :(విజన్ ఆంధ్ర )పుట్టబోయే శిశువు అమ్మాయా, అబ్బాయా అని తెలియజేసేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టబోయేది ఆడ శిశువు అని నిర్ధారణ చేసి, గర్భవిచ్ఛిత్తికి పాల్పడడం క్షమించరాని నేరమని, ఇది ఎంతో శోచనీయమని అన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపెక్షించకుండా, బాధ్యులపై ఎం.టి.పి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధానికి చేపడుతున్న చర్యల విషయమై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని నివేదికలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహ వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ఈ చర్యలకు పాల్పడిన స్కానింగ్ సెంటర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్కాగా నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే లైసెన్సులు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. పి.సి.పి.ఎన్.డి.టి, ఎం.టి.పీ చట్టాలను ఉల్లంఘించడం వల్ల సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. పుట్టబోయే శిశువు ఆడ, మగ ఎవరైనా సరే, అందరూ సమానమే అని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్న అక్రమ కట్టడాలు.

నిజామాబాద్ ఆగస్టు18:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అక్రమ కట్టడాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు సాగుతున్న సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ప్రధాన వీధుల గుండా రోడ్డు పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారుల విఫ్లమవుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు భారీగా ముడుపులు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని పూలాంశీ గ్ సమీపంలో గల టిటిడి కళ్యాణ మండపం ముందు నాన్ లేఅవుట్ ప్లాట్ లో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ అక్రమ ఇంటి నిర్మాణం పై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందిన చర్యలు తీసుకోకపోవడం వెనుక మామూళ్ల బాగోతం ఉన్నట్లు స్పష్టమవుతుంది. దీనిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు ఇంటి యజమానితో బేరా సారాలు సాగించి ముడుపులు తీసుకున్నట్లు స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే తరహాలో నగరంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారుల జేబులు నింపుతున్నాయి. నిరుపేదలు నిర్మించుకుంటున్న ఇండ్లపై నిబంధనల సాకుతో చర్యలు తీసుకుంటున్న అధికారులు బడా బాబుల నిర్మాణాలపై మౌనంగా ఉండడం ఆరోపణలకు బలాన్ని చేకూరు వస్తున్నాయి. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా నోటీసులు జారీ చేశామని తప్పుడు సమాచారం అందించి ఫిర్యాదు దారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ తో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




## సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**- అదనపు కలెక్టర్ భుజంగరావు**

**- ఘనంగా జయంతి వేడుకలు**



నిజామాబాద్, ఆగస్టు 18 :(విజన్ ఆంధ్ర )సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి వేడుకల సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్న అని గుర్తు చేశారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను పాపన్న గౌడ్ అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

## మినీ జాబ్ మేళాకు విశేష స్పందన

**- నిజామాబాద్ జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వేల్పుల విజేత,**




నిజామాబాద్ ఆగస్టు18, ( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ నగరంలో మంగళవారం ఈరోజు స్థానిక జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, శివాజీ నగర్ నందు జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇట్టి జాబ్ మేళాలో మూడు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి నిజామాబాద్ లోని స్థానిక ప్రూడెన్స్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ, మహీంద్రా షోరూం లలో గల స్థానిక ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడ్డాయి. ప్రూడెన్స్ హాస్పిటల్లో నర్సులు, రిసెప్షనిస్ట్ ఖాళీలకు, అపోలో ఫార్మసీ నందు ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్టు, అప్రెంటిస్ ఖాళీలకు, మహేంద్ర షో రూమ్ లో మేనేజర్లు, మెకానిక్ లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఖాళీలకు ఇంటర్వ్యూ నిర్వహించబడ్డాయి. ఈ మినీ జాబ్ మేళాలో 168 మంది నిరుద్యోగులు పాల్గొనగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 52 మందిని వివిధ ఖాళీలకు ఎంచుకున్నారు.వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు జిల్లా ఉపాధి కల్పనాదికారిణి శ్రీమతి వేల్పుల విజేత చేతుల మీదు గా అందచేశారు... వారికి జీతం 13,500 నుండి 18,000 వరకు ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారిణి శ్రీమతి వేల్పుల విజేత మాట్లాడుతూ స్థానిక ఖాళీలు వెతికి నిరుద్యోగ యువత కోసం స్థానిక జాబ్ మేళా ఏర్పాటు చేయబడిందని, దానిని సద్వినియోగం చేసుకున్న యువకులకు, నిరుద్యోగులకు శుభాకాంక్షలు తెలియచేశారు..ఇకపై ప్రతినెల స్థానిక ఖాళీలతో జాబ్ మేళా నిర్వహిస్తామని ప్రకటించారు..గతంలో నిర్వహించిన విదేశీ మెగా జాబ్ మేళా నందు (4620) మంది నిరుద్యోగులు టామ్ కామ్ లో నమోదు కబడ్డారని, వారిలో మొదటి దశలో (120) మంది జర్మనీ దేశం లో ఉద్యోగాలకు ఎంపిక కాబడ్డారని తెలిపారు..వారి కొరకై వచ్చే వారంలో జర్మనీ భాష శిక్షణా తరగతులు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు...అందరు నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇట్టి జాబ్ మేళా నందు హెచ్ఆర్ లు కిరీటి, మారుతి,జపానియా, కార్యాలయ సిబ్బంది స్వాతి, అనిత్,సందీప్, సత్యనారాయణ,రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరుణ యాగ పాదయాత్ర

**- ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్**




అలంపూర్ ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా అలంపూర్ నియోజకవర్గంలో అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ వరుణ యాగ పాదయాత్ర నిర్వహించనున్నారు. కావున ఆగస్టు 19 బుధవారం రోజున ఉదయం 09:00 గంటలకు ఈశ్వరమ్మ గుడి (శాంతినగర్ రవీంద్ర హై స్కూల్) నుండి జులేకల్ శివాలయం వరకు ఈ పాదయాత్ర శాంతినగర్ రవీంద్ర హై స్కూల్ నుండి ప్రారంభమై జులేకల్ శివాలయం అర్డిఎస్.కాలువ వరకు కొనసాగుతుంది. అలంపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పాదయాత్రను విజయవంతం చేయవలసిందిగా కోరారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి..!

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్న కలెక్టర్, ఇతర అతిథులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న మొగలులను, గోల్కొండ నవాబులను ఎదిరించిన గొప్పవీరుడని కొనియాడారు. సర్దార్ పాపన్న గౌడ్ కేవలం ఒక వీరయోధుడే కాకుండా, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పోరాడిన సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. పేదల కోసం ఆయన చేసిన త్యాగం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా నడిపిన ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు. గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ మొగల్ రాజుల దురాగతాలకు, నిజాం దోపిడీ పాలనకు వ్యతిరేకంగా అచంచల ధైర్యసాహసాలతో పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం తన జీవితాన్ని అర్పించి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. సమానత్వం, ఆత్మ గౌరవ ప్రతీకగా పాపన్న నిలుస్తారన్నారు. ఆయన జయంతి సందర్భంగా త్యాగస్ఫూర్తిని స్మరించుకోవడం ప్రతి తరానికి గర్వకారణమనీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, జిల్లా అధికారులు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి, గణపతి రెడ్డి, లింగాచారి, ఇతర అధికారులు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టులో ఘనంగా జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**-న్యాయ వ్యవస్థ గౌరవాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటమే ధ్యేయం**

**-హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్**

**-మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ పి.వి. నరసింహారావు వారసత్వం, ఆశయాలే నాకు మార్గదర్శకం**



హైదరాబాద్ ఆగస్టు-18(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) గౌరవ న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వి. శ్రవణ్ కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం హైకోర్టు ప్రాంగణంలో అత్యంత వైభవంగా,కోలాహలంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. భారతదేశ దిగ్గజ నాయకుడు, మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ పి.వి. నరసింహారావు మనవడైన జస్టిస్ శ్రవణ్ కుమార్.. తన తాత స్ఫూర్తితో న్యాయరంగానికి విశిష్ట సేవలందిస్తూ, సమర్థవంతమైన, నిష్పాక్షికమైన తీర్పులతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ శుభసందర్భంగా హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) ఈ. రవీందర్ రెడ్డి నేతృత్వంలో ప్రముఖ న్యాయవాదులు బోయిని ఆనంద్, గుడి మధుసూదన్ రెడ్డి, చట్ల మణికుమార్ తదితర న్యాయకోవిదులు జస్టిస్ శ్రవణ్ కుమార్ ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి రాజ్యాంగబద్ధమైన విలువలను కాపాడుతూ, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఆయన చూపుతున్న శ్రద్ధ, నిరంతర కృషి వర్ధమాన న్యాయవాదులకు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు కొనియాడారు.ఆయనకు భగవంతుడు పరిపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసిన న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు అభిమానులను ఉద్దేశించి గౌరవ న్యాయమూర్తి మాట్లాడుతూ "నన్ను ఆశీర్వదించి, ఇంతటి ప్రేమాభిమానాలను అందించిన తోటి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. న్యాయవ్యవస్థ అనేది ప్రజాస్వామ్యానికి, సమాజానికి బలమైన పునాది. మా తాత, మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు నాకు నేర్పిన విలువలు, క్రమశిక్షణ, దేశభక్తే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టాయి. ప్రజాసేవ, రాజ్యాంగ పరిరక్షణనే ఆయన తన శ్వాసగా భావించేవారు.అదే మార్గంలో నడుస్తూ, రాజ్యాంగం పట్ల పూర్తి నిష్ఠతో పనిచేయడమే నేను ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. సామాన్య మానవుడికి న్యాయం త్వరితగతిన, పారదర్శకంగా అందడమే మన న్యాయవ్యవస్థ ప్రధాన లక్ష్యం.బాధితులకు కాలయాపన లేకుండా న్యాయఫలాలు అందించడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమైనది. సీనియర్ న్యాయవాదులతో పాటు యువ న్యాయవాదులు చట్టాలపై అవగాహన పెంచుకుని, నిరంతరం అధ్యయనం చేస్తూ బాధితులకు అండగా నిలవాలి.నా ఈ న్యాయసేవా ప్రయాణంలో మీరందరూ చూపిస్తున్న ఈ గౌరవం, ఆప్యాయత నాపై బాధ్యతను మరింత పెంచాయి. సమాజానికి, ప్రజా సంక్షేమానికి నా శక్తివంచన లేకుండా సేవ చేయడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ వేడుకల్లో పలువురు హైకోర్టు సీనియర్,జూనియర్ న్యాయవాదులు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు, కోర్టు అధికారులు, సిబ్బంది అభిమానులు పాల్గొని జస్టిస్ శ్రవణ్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఏసీబీ వలలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

**- రూ.20 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ప్రభావతి**

**- భవన నిర్మాణ అనుమతి ఉత్తర్వుల కోసం లంచం డిమాండ్**

**- ఫిర్యాదు అందగానే రంగంలోకి దిగిన ఏసీబీ.. వ్యూహాత్మకంగా పట్టుకున్న అధికారులు**

**- నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరు.. జుడీషియల్ రిమాండ్**



హైదరాబాద్, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): భవన నిర్మాణ అనుమతుల విషయంలో లంచం డిమాండ్ చేసిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కారు. చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్‌నగర్ సర్కిల్-25 కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఛత్రపతి ప్రభావతి రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

**అనుమతుల కోసం రూ.20 వేల డిమాండ్**

బాధితుడు భవన నిర్మాణానికి సంబంధించిన బిల్డింగ్ పర్మిషన్ ఫైల్, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ కోసం జీహెచ్ఎంసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించి అనుమతుల ప్రక్రియను పూర్తి చేసేందుకు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు.

**చేతికి చిక్కిన అవినీతి అధికారి**

ఏసీబీ అధికారులు పన్నిన వ్యూహం ప్రకారం బాధితుడి నుంచి ప్రభావతి రూ.20 వేల లంచం నగదు స్వీకరిస్తుండగా అధికారులు అక్కడికి చేరుకుని ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, ఆమెపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రజా విధులను నిర్వర్తించాల్సిన ప్రభుత్వ ఉద్యోగి అక్రమ ప్రయోజనం కోసం తన అధికారాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై తదుపరి చర్యలు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

**న్యాయస్థానానికి తరలింపు**


అరెస్టు చేసిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతిని నాంపల్లిలోని ఎస్పీఈ & ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆమెను జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని ఆయన వివరాలను వెల్లడించలేదని అధికారులు స్పష్టం చేశారు.

**లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా పని చేసేందుకు అధికారులు లేదా ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే ఏసీబీ వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. లంచం అడిగేవారిపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

# నాగర్ కర్నూల్ డీఈఓ డిప్యూటేషన్ ఆదేశాలపై ఉపాధ్యాయుల నిర్లక్ష్యం?

**డిప్యూటేషన్ ఇచ్చిన ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరిక**




కొల్లాపూర్ / పెంట్లవెల్లి, ఆగస్టు 18 :(విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయ సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, కొందరు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలను పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెంట్లవెల్లి మండలంతో పాటు ఇతర మండలాల్లోనూ డిప్యూటేషన్, అడ్జస్ట్‌మెంట్ ఆదేశాలు అమలులో ఉన్నప్పటికీ, కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆదేశాల మేరకు టీచర్లు నేటి వరకు హాజరుకాలేదని సమాచారం. ఖాళీలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధన వ్యవస్థను బలోపేతం చేయాలన్నది విద్యాశాఖ ఉద్దేశం. అయితే, కొందరు ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన చోటే కొనసాగాలన్న ధోరణితో డిప్యూటేషన్ ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు సబ్జెక్టు పాఠాలు అంతరాయం పాలవడం, సబ్జెక్ట్ టీచర్ల కొరత మరింత పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని విద్యావర్గాలు చెబుతున్నాయి.

**ఇచ్చిన డిప్యూటేషన్ పై వెళ్లకపోతే చర్యలు తప్పవు డిఇఓ**

డిప్యూటేషన్ ఇచ్చిన ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లి విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని డీఈఓ స్పష్టం చేసినట్లు సమాచారం. ఆదేశాలను పాటించని ఉపాధ్యాయులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇలాంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్న ఉదాహరణలూ ఉన్నాయని తెలుస్తోంది. జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ విద్యార్థుల ప్రయోజనం కోసమేనని అధికారులు చెబుతున్నా, కొన్ని చోట్ల ఆదేశాల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఈఓ ఆదేశాలను పాటించని ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ, తక్షణమే ఉపాధ్యాయులకు ఇచ్చిన డిప్టేషన్ ఆర్డర్ ప్రకారం మీ మీ పాఠశాలలో విధులకు హాజరు అయి విద్యార్థులకు విద్యాబోధన అందించాలని ఆయన అన్నారు .







# పెన్ పహాడ్‌లో సర్పంచుల ఫోరం ఎన్నికల సందిగ్ధత!

**-ఏడాది కావస్తున్నా అడుగు ముందుకు పడని వైనం**

**-పొరుగు మండలాల్లో ఎన్నికలు పూర్తి.. ఇక్కడే ఎందుకీ జాప్యం?**

**-'హస్తం' చేతిలోనే మెజారిటీ.. చర్యలు తీసుకోవడంలో అధిష్టానం నిర్లక్ష్యం?**

**-ఒకే తాటిపైకి వస్తేనే సమస్యల పరిష్కారమంటున్న సర్పంచులు**




పెన్ పహాడ్, ఆగస్టు 18 ( విజన్ ఆంధ్ర): సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల సర్పంచుల ఫోరం ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధత స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మండలంలో సర్పంచుల సాధారణ ఎన్నికలు ముగిసి, మరో రెండు నెలలు గడిస్తే ఏడాది పూర్తి కావస్తున్నా, ఇప్పటివరకు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక జరగకపోవడం పల్లెల ప్రగతికి ప్రతిబంధకంగా మారింది. చుట్టుపక్కల ఉన్న అన్ని మండలాలు ఇప్పటికే తమ సర్పంచుల ఫోరం అధ్యక్షులను ఎన్నుకొని, గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుకు సాగుతుంటే.. పెన్ పహాడ్ మండలంలో మాత్రం ఈ ప్రక్రియ నిలిచిపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని, తగిన చర్యలు తీసుకొని అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మండల పరిధిలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా సుమారు 23 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని ఏకపక్ష మెజారిటీతో స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. రాజకీయ సమీకరణాల ప్రకారం ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచే ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తిరుగులేని బలం ఉన్నప్పటికీ, ఈ ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న ఆలస్యం వెనుక అంతర్గత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం త్వరగా ఒక ఖచ్చితమైన నిర్ణయం తీసుకొని, ఈ సందిగ్ధతకు తెరదించేలా తగిన చర్యలు చేపట్టాలని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. యూనిట్ లేకపోవడమే శాపం సమస్యల వలయంలో సర్పంచులు!గ్రామాల్లో ఎదురవుతున్న రోజువారీ ఇబ్బందులు, నిధుల కొరత, మరియు స్థానిక సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటరి పోరాటం కంటే అందరం కలిసి ఒకే 'యూనిట్' గా ఏర్పడితేనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనుకున్న పనులు సాధించుకోవచ్చని సర్పంచులు అభిప్రాయపడుతున్నారు. ఒక సమర్థుడైన నాయకుడిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే, సర్పంచులందరి గొంతుకగా నిలిచి సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. వ్యక్తిగతంగా వెళ్లేదానికంటే, ఫోరం రూపంలో వెళ్తేనే సమస్యలకు త్వరితగతిన మోక్షం లభిస్తుంది.ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరియు ఉన్నత నాయకత్వం త్వరితగతిన స్పందించి, పెన్ పహాడ్ మండల సర్పంచుల ఫోరం ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, తద్వారా మండల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం...
# ఇల్లంతా లక్ష్మీ కళ"

## "అష్టైశ్వర్యాల కోసం ముత్తైదువుల మొక్కులు"
## "కలశమే దేవత... కుటుంబమే గుడి"

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 18: శ్రావణ మాసం వచ్చిందంటే ఆడపడుచుల ఇళ్లలో సందడి మొదలవుతుంది. ఆ పండుగల్లోకెల్లా అత్యంత విశిష్టమైనది వరలక్ష్మీ వ్రతం. ధన, ధాన్య, సంతాన, సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీ దేవిని వరాలిచ్చే తల్లిగా కొలిచే ఈ వ్రతం 21 శుక్రవారం నాడు భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఉదయం నుంచే ఇల్లంతా పరిమళాలు, పూల వాసనలు. గడప నుంచి గుమ్మం వరకు లక్ష్మీ కళ తొణికిసలాడే రోజు ఇది.



**తెల్లవారుజామునే మంగళ వాయిద్యాలు**

శుక్రవారం తెల్లవారుజాము 4 గంటలకే ఇంటి ఆడవారు లేస్తారు. ఇల్లంతా ఆవుపేడతో అలికి, బియ్యప్పిండితో ముగ్గులు పెడతారు. గడపకు పసుపు, కుంకుమ రాసి, మామిడి తోరణాలు, పూల దండలతో ఇంటిని అలంకరిస్తారు. పూజగదిలో వెండి లేదా కంచు కలశం ప్రతిష్టిస్తారు. కలశానికి పసుపు రాసి, కొత్త చీర కట్టి, మెడలో పూలదండ వేస్తారు. కలశంలో శుభ్రమైన నీళ్లు పోసి, అందులో పసుపు కొమ్ము, తమలపాకులు, పూలు, నాణేలు వేస్తారు. పైన కొబ్బరికాయ పెట్టి "ఓం శ్రీ మహాలక్ష్మీ నమః" అంటూ ఆవాహన చేస్తారు. ఆ కలశమే ఆ ఇంటికి సాక్షాత్ లక్ష్మీదేవి.

**16 పిండివంటలు - భక్తికి నిదర్శనం**



వరలక్ష్మీ అమ్మవారికి 16 రకాల పిండివంటలు అంటే ఎంతో ఇష్టం అని పెద్దల మాట. అందుకే ఇంటి మహిళలు రాత్రి నుంచే వంటల్లో మునిగిపోతారు.అరిసెలు, లడ్డూలు, జిలేబీలు, పూర్ణం బూరెలు, గారెలు, అప్పాలు, బూరెలు, పాయసం తో పాటు కొబ్బరి, బెల్లం, పండ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. ధూప, దీప, నైవేద్యాలు పెట్టిన తర్వాత వరలక్ష్మీ వ్రత కథను భక్తితో చదువుతారు. చివరగా కర్పూర హారతి ఇచ్చి, "అమ్మా లక్ష్మీ... మా ఇంట నిలిచి ఉండు" అని మొక్కుకుంటారు. పూజ అనంతరం ముత్తైదువులను ఇంటికి పిలిచి పసుపు, కుంకుమ, తాంబూలం, చీర-రవిక, గాజులు ఇచ్చి సత్కరిస్తారు. వారి ఆశీర్వాదం తీసుకోవడమే ఈ వ్రతంలో ప్రధానం.





**"మా కోరిక ఒక్కటే... కుటుంబం చల్లగా ఉండాలి"**

"భర్తకు ఆయురారోగ్యాలు, పిల్లలకు మంచి చదువు, ఇంట్లో ధనధాన్యాలు వృద్ధి చెందాలని ఈ వ్రతం చేస్తాం. అమ్మవారు మమ్మల్ని చల్లగా చూడాలి" అని గృహిణులు చెబుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని లక్ష్మీదేవి ఆలయాలు, మహంకాళి గుడులు కూడా రేపు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఉదయం నుంచే కుంకుమార్చనలు, అభిషేకాలు, భజనలు నిర్వహించనున్నారు.

**పూజ కాదు... ఇది అనుబంధాల పండుగ**

వరలక్ష్మీ వ్రతం అంటే కేవలం పూజ మాత్రమే కాదు. ఇది ఒక సామాజిక వేడుక. అక్కచెల్లెళ్లు, వదినలు, స్నేహితులు అందరూ కలిసి పాటలు పాడుకుంటూ, కథలు చెప్పుకుంటూ జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఇచ్చిపుచ్చుకోవడాలు, బంధాల బలోపేతం జరుగుతాయి. "ఒంటరిగా కాదు, అందరితో కలిసి చేసే పూజకు మరింత ఫలితం ఉంటుంది" అని పండితులు చెబుతున్నారు.

**పండితుల సూచనలు**

"వరలక్ష్మీ వ్రతం రోజున మనసు శుద్ధిగా ఉంచుకోవాలి. ఎవరితోనూ గొడవ పడకుండా, కోపం లేకుండా పూజ చేయాలి. వీలైనంత మంది ముత్తైదువులకు తాంబూలం ఇస్తే అమ్మవారి కృప లభిస్తుంది. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం నైవేద్యం తినడం ఉత్తమం" అని ఆలయ పూజారులు సూచిస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం అంటే కేవలం ఆచారం కాదు. అది ఒక భక్తి, ఒక నమ్మకం, ఒక అనుబంధం. రేపు ఇల్లిల్లు లక్ష్మీమయం కానుంది. "వరాలిచ్చే తల్లి అందరి ఇళ్లలో కొలువై ఉండాలని" భక్తులు ప్రార్థిస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.